www.prajapakshan.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శుక్రవారం | 13 | జూన్ | 2025
పేజీలు : 8

## ప్రైవేటు కంటే మెరుగైన విద్య




-పాఠశాల ప్రారంభం రోజునే పుస్తకాలు, యూనిఫాం పంపిణీ
-పువ్వాడ నగర్‌లో పాఠశాలను ప్రారంభించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

2లో

# వర్గ పోరులో ఆమె ఓ సమిధ

## జిల్లా, జాతీయ నాయకుడిని బదనం చేసే కుట్ర



ప్రజాపక్షం/ఖమ్మం



ఒక జాతీయ పార్టీ ఖమ్మం జిల్లా శాఖ వర్గ పోరులో నలిగి చిక్కి శల్యమవుతుంది. మూడుసార్లు జాతీయ స్థాయిలో అధికారాన్ని కొల్లగొట్టిన రాష్ట్రంలో తృతీయ స్థాయిలో నిలిచి సత్తా చాటినా జిల్లాలో మాత్రం కనీసం ఒక్క స్థానిక సంస్థలోనైనా ప్రభావం చూపలేని పరిస్థితి. చాలా కాలం తర్వాత ప్రత్యర్థి పార్టీ వర్గ పోరు అప్పటి అధికార పార్టీ నాయకునిపై ఉన్న అసమ్మతితో ఎట్టకేలకు ఒక్క కార్పోరేటర్ గెలిచారు. అది మినహా ఎక్కడ ప్రజా ప్రాతినిధ్యమే లేరు. ఇంతటి బలహీనమైన పార్టీ వర్గపోరుతో చాలా బలంగా కొట్టుకుంటుంది. తాజాగా వర్గ పోరులో ఆమె సమిధగా మారింది. జిల్లా నాయకత్వంలో పెనుమార్పులు చోటుచేసుకున్న తర్వాత ప్రస్తుత జిల్లా నాయకుడిని ఆయనకు అండగా నిలిచారన్న నెపంతో ఓ జాతీయ నాయకుడిని బదనం చేసే కుట్ర ప్రారంభమైంది. అందుకు ఆమె ఎరగా ఉపయోగపడింది. కొద్ది రోజుల క్రితం ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మహిళ వేధింపు అంశాన్ని ప్రస్తావించినా బాధ్యతలు నుంచి తప్పుకున్న ఓ నాయకుడి దానిని ఉపయోగించుకొని మళ్లీ పార్టీపై పెత్తనం చెలాయించాలని చూస్తున్నాడు. ఆ కుట్రలో భాగంగా తనకు ప్రస్తావించిన విషయాన్ని బహిర్గతం చేశాడు. చివరకు జాతీయ నేతగా చెప్పుకునే మహిళ నేత వద్దకు పంచాయితీ చేర్చాడు. అప్పటి వరకు బిజెపీలో ఓ మహిళతో పాటు పార్టీలో పనిచేసే ఓ వ్యక్తికి మధ్య జరిగిన వ్యవహారం అకస్మాత్తుగా ఓ జాతీయ నాయకుడికి

మిగతా 2లో..

# నగరాన్ని పరిశుభ్రంగా ఉంచండి

-చేసిన పనులు జీవిత కాలం ఉండాలి
-అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు
-అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల శంకుస్థాపన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మేయర్ పునుకొల్లు నీరజ , అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ లతో కలిసి ఖమ్మం కార్పోరేషన్ ఐదవ డివిజన్ ఖానాపురం ప్రాంతంలో పర్యటించి టియుఎఫ్ఐడిసి నిధులు రూ. 50 లక్షలతో నిర్మించనున్న స్టార్మ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రజల సహకారంతో ఖమ్మం నగరం పరిశుభ్రంగా ఉంటుందని ఈ సహకారం మరింత కొనసాగించాలని మంత్రి తెలిపారు. ఖమ్మం

మిగతా 2లో..

## ఖమ్మం కలెక్టర్‌గా అనుదీప్

### -ముజమ్మిల్ ఖాన్ బదిలీ



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మం కలెక్టర్‌గా పనిచేస్తున్న ముజమ్మిల్ ఖాన్ ను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముజిమ్మిల్ ఖాన్‌ను సివిల్ సప్లయ్ చీఫ్ రేషనింగ్ ఆఫీసర్‌గా, ఎఫ్ఎసి సహాయ కార్యదర్శిగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఖమ్మం నూతన కలెక్టర్‌గా అనుదీప్ ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దురిశెట్టి అనుదీప్‌ను ఖమ్మం కలెక్టర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగాపెద్ద ఎత్తున ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

## ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే..




-సిపిఐ మండల మహాసభలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం

2లో

# తీరనున్న సాగునీటి కష్టాలు



-దశాబ్దాల కల సాకారం
-లిఫ్ట్ ఇరిగేషన్‌తో రఘునాథపాలెం మండలంలో జలకళ

**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** సాగునీటి కోసం దశాబ్దాలుగా ఎదురు చూసిన రైతుల కల సాకారం కానుంది. చెంతనే సాగర్ కాలువ ఉన్న ఎటువంటి ఉపయోగం లేక పోయింది. వర్షాధార, బోర్ల పైనే ఆధారపడి పంట సాగు చేయాల్సి ఉండేది. సాగునీరు లేక పలువురు రైతులు సాగును వదిలేశారు. ఇప్పుడు మండలానికి సాగునీటి సమస్య తీరనుండడంతో మళ్లీ సాగు చేసేందుకు పలువురు రైతులు సిద్ధమవుతున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేకంగా దృష్టి సారించి రఘునాథపాలెం మండలానికి సాగునీటిని అందించేందుకు మంచుకొండ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుట్టి నాలుగు నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది జనవరి మాసంలో రూ. 66 కోట్లతో ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి నాలుగు నెలల్లోనే ట్రయల్ రన్ నిర్వహించారు. వానా కాలం సాగుకు సాగునీటిని అందించేందుకు అధికారులు తగు చర్యలు చేపట్టారు. రూ. 66 కోట్లతో మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం నాగార్జున సాగర్ డిప్ కట్ వద్ద మంచు కొండ ఎత్తిపోతల పథకానికి

మిగతా 2లో..

# ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే..

**ప్రజాపక్షం/కామేపల్లి :** ఎన్నికల్లో గెలిచిన ఓడిన నిరంతరం ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. కామేపల్లి సిపిఐ 18వ మండల మహాసభ మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామంలో గురువారం సిపిఐ మండల సహాయ కార్యదర్శి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భాగం హేమంతరావు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దోపిడి, అనుచివేతకు గురవుతున్న ఏజెన్సీ గ్రామాల ప్రజల జీవన ప్రమాణా మార్పుకు నాంది పలికి ఆధునికత వైపు నడిపించింది ఎర్రజెండానే అన్నారు. అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమని, అన్యాయం దోపిడి అణచివేత ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూర్తి అవగాహనతో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. దేశానికి ప్రత్యామ్నాయం కమ్యూనిస్టులేనన్నారు. దేశంలో బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తుందని, ఆపరేషన్ కగారు పేరుతో అమాయక పేద ప్రజల ప్రాణాలను, బిజెపి ప్రభుత్వం పొట్టన పెట్టుకుందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలకు ముందు, ఎన్నికల తర్వాత ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం : దండి సురేష్**

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలల్లో ఉమ్మడి ఖమ్మం



జిల్లాలో సిపిఐ సత్తా చాటుతుందని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ ధీమా వ్యక్తం చేశారు. కామేపల్లి సిపిఐ 18వ మండల మహాసభలో ఆయన పాల్గొని ప్రసంగిస్తూ సిపిఐ శ్రేణులు కార్యకర్తలు నాయకులు ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. తొలుత తాళ్లగూడెం గ్రామంలో మండల మహాసభ సందర్భంగా సిపిఐ జెండాను ఎగరవేశారు. ఈ మండల మహాసభలో సిపిఐ, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎర్ర బాబు, ఏపూరి లతాదేవి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వర్లు, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, సహాయ కార్యదర్శి శివ, కామేపల్లి మండల సిపిఐ కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు, సిపిఐ జిల్లా, మండల నాయకులు పుచ్చకాయల కృష్ణ, శ్రీను, వెంకటకృష్ణ, శతకోటి సత్యనారాయణ, సిరిపురపు ప్రభాకర్‌రావు, బండి శ్రీను, అమరబోయిన తిరపయ్య, ఎస్‌కే సలీం, అంబడపూడి జగ్గయ్య, మండల పరిధిలోని సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

# వర్గ పోరులో ఆమె ఓ సమిధ

(మొదటిపేజీ తరువాయి)

చుట్టివేశారు. జాతీయ నాయకుడిని బదనం చేయడం ద్వారా జిల్లా బాధ్యతల్లో ఉన్న వ్యక్తులను బదనం చేయడం చాలా తేలిక అన్న భావనతో ఆమెను సమిధగా మార్చాడు. పంచాయతీ నిర్వహించిన విషయం మీడియా ద్వారా రచ్చకు ఎక్కించి మొత్తం పార్టీని భ్రష్టు పట్టిస్తున్నారు అనే రీతిలో అధిష్టానానికి ఫిర్యాదు చేయడానికి సిద్ధమయ్యారు. అనేక దశాబ్దాలుగా రాజకీయాలు ఉండి ఇప్పుడు జాతీయ నేతగా ఆ పార్టీలో కొనసాగుతున్న వ్యక్తిని టార్గెట్‌గా ఎంచుకొని ఈ పంచాయతీకి తెరలేపారని, ఈ కుట్ర వెనుక ఖమ్మం జిల్లాకు చెందిన ఇద్దరు నాయకుల పాత్ర ఉందనే ఆరోపణ ఆ పార్టీ నుంచే విన్పిస్తున్నాయి. బలహీనంగా ఉన్న పార్టీని బలోపేతం చేయడం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడం జాతీయ స్థాయిలో పార్టీకి ఉన్న చరిష్మాను వినియోగించుకొని రాబోయే స్థానిక ఎన్నికల్లో సత్తా చాటేందుకు ప్రయత్నించాల్సిన సమయంలో వర్గ పోరుతో ఆ పార్టీని చిదిమేసే ప్రయత్నం చేస్తున్నారు. ఎక్కడికక్కడ బలహీన ప్రాంతాల్లో సైతం గణనీయమైన ఓట్లు సాధిస్తున్నా ఆ పార్టీకి ఖమ్మంలో ఇసమెత్తు పెగలకపోవడం వెనుక వర్గపోరేనన్నది సుస్పష్టం. కీలక సమయాల్లో పార్టీ పట్ల ఆదరణ పెరిగే సమయంలో ప్రత్యర్థులతో చేతులు కలిపే నాయకులే ఆ పార్టీకి తీవ్ర నష్టం కలిగిస్తున్నారన్న అభియోగాలు చాలాసార్లు వినిపించాయి. ఇప్పుడు ఈ రచ్చతో పార్టీ పరువును బయటకు ఈడ్చడమే కాకుండా నాయకులకు నష్టం కలిగించి తాము ఉంటేనే పార్టీ, లేదంటే ఏమి ఉండదనే భావన కలిగించే రీతిలో కొందరు వ్యవహరిస్తున్నారని ఆ పార్టీ అభిమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు గోడల మధ్య జరిగిన ఘటనను రచ్చ చేయడం ద్వారా పార్టీకేమి మేలు చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు రాష్ట్ర పార్టీ నేతలు. ఖమ్మం జిల్లా పార్టీని గాడిన పెడతారో, వర్గపోరుతో పార్టీని సమిధగా మారుస్తారో వేచిచూడాలి.

# నగరాన్ని పరిశుభ్రంగా ఉంచండి

(మొదటిపేజీ తరువాయి)

నగరం ప్రజలకు మాత్రమే చెందుతుందని కలెక్టర్, ఉన్నతాధికారులు, మంత్రులు మారుతుంటారని ప్రజలు మాత్రం తరతరాలుగా ఇక్కడే జీవిత కాలం నివసించాలని తెలిపారు. అందుకే ఖమ్మం నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుకోవాలని తెలిపారు. నగరంలోని పరిసరాలు పరిశుభ్రత, పచ్చని చెట్లు ఉండేలా వీలైన చోట మొక్కలు నాటి వాటిని సంరక్షించుకోవాలన్నారు. నగరంలో గుడిసెల్లో ఉంటూ అర్హులైన పేదలందరికీ మొదటి దశలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు.పేదలు మురికి కాలువల వెంబడి బతకాల్సిన అవసరం లేదని భూమి లేని నిరుపేదలకు సైతం ప్రభుత్వ భూముల్లో కాలనీల్లో ఏర్పాటు చేస్తామన్నారు. గతంలో వైఎస్ఆర్ కాలనీ వద్ద పట్టాలు ఇస్తే కొంత మంది వెళ్లమని చెప్పారని నేడు అదే ప్రాంతం అభివృద్ధి చెంది మల్టీప్లెక్స్‌లు కూడా వస్తున్నాయన్నారు. బైపాస్ రోడ్డు వేసే సమయంలో ఇక్కడ ఎవరు లేరు ఎందుకని విమర్శించారని నేడు ఆ రోడ్డు సరిపోవడం లేదన్నారు. కార్పోరేషన్ పరిధిలో మట్టి రోడ్లు లేకుండా అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ ఖమ్మం నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న మున్సిపల్ సిబ్బంది, అధికారులు, ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. మనం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. నిర్మాణ పనులను నాణ్యతతో నిర్మించుకునేలా ప్రజలు, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించాలన్నారు. విలీనమైన ప్రాంతాల్లో డ్రైన్లు, రోడ్ల నిర్మాణం చాలా కీలకమన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆర్డీవో జి. నర్సింహారావు, నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ షఫీవుల్లా, మున్సిపల్ అధికారులు రంజిత్, కృష్ణలాల్, కార్పోరేటర్ పల్లెబోయిన భారతి చంద్రం, మలీదు వెంకటేశ్వర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**అండర్ డ్రైనేజీ పనులు పరిశీలించిన మంత్రి తుమ్మల :**

ఖమ్మం నగరంలో జరుగుతున్న అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులు, వరద నీటి కాలువ, రోడ్డు వెడల్పు పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వరద కాలువ వైడనింగ్ పనులు సిఆర్‌జి టవర్స్ దగ్గర పరిశీలించి పనులు వేగవంతంగా చేయాలని అధికారులకు సూచించారు. లకారం చెరువు, అల్లిపురం రోడ్డు గంగమ్మతల్లి టెంపుల్ వద్ద కూడా కాలువ పనులను మంత్రి పరిశీలించారు. గంగమ్మ తల్లి దేవాలయం వద్ద కాలువ ఆక్రమణ జరిగిందని వచ్చిన ఫిర్యాదుకు మంత్రి స్పందిస్తూ రెవెన్యూ అధికారులు టోపో మ్యాపు ప్రకారం ఆక్రమణలను చెక్ చేయాలని మంత్రి ఆదేశించారు. అనంతరం రైల్వేస్టేషన్ రోడ్డులో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను మంత్రి పరిశీలించారు. రోడ్డు విస్తరణలో దుకాణాలు పోతున్న వారికి ప్రత్యామ్నాయం చూపించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, ఆర్డీవో జి. నర్సింహారావు, నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ షఫీవుల్లా, మున్సిపల్ అధికారులు, కార్పోరేటర్లు పాల్గొన్నారు.

# ప్రైవేటు కంటే మెరుగైన విద్య



**ప్రజాపక్షం/రఘునాథపాలెం :** ప్రైవేటు కంటే మెరుగ్గా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం మండల పరిధిలోని పువ్వాడ నగర్‌లో ఏర్పాటు చేసిన మండల ప్రాథమిక పాఠశాలను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ప్రారంభించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు బాగా చదువుకోవాలని పాఠశాల



ప్రారంభించిన మొదటి రోజే పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రతి రోజు పిల్లలు సాయంత్రం పూట కొంత సమయం చదువుతో పాటు కొంత సమయం ఆడుకోవాలని తెలిపారు. మంచి ఆహారం తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. బాల్యంలో చదువు, ఆటలు, ఆరోగ్యం చాలా కీలకమన్నారు. ఇంటి భోజనంతో మంచి ఆరోగ్యం వస్తుందని బయట ఫుడ్ తినవద్దని సూచించారు. పిల్లలు తమ లక్ష్యాలను ఒక పుస్తకంలో రాసుకుని ప్రతి రోజు గుర్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ వేసవి సెలవుల అనంతరం సంతోషంగా పండుగ వాతావరణంలో జిల్లా వ్యాప్తంగా పాఠశాలను ప్రారంభించుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రతి వర్గానికి చెందిన పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, జిల్లాలో మూతపడిన పాఠశాలలను పునః ప్రారంభిస్తున్నామని, పాఠశాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి పిల్లవాడిలో టాలెంట్ ఉంటుందని దానిని సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వ పాఠశాలల్లో కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకం పెంచేలా తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పాఠశాలల్లో ఏఐ టూల్స్ వినియోగించుకుని నాణ్యమైన ఆంగ్ల విద్యను అందిస్తున్నామన్నారు. ప్రైవేటు పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. గతంలో వైరా మండలం నారపునేనిపల్లిలో ఒకే విద్యార్థిని ఉన్న పాఠశాలలో 20 మంది విద్యార్థులు జాయిన్ అయ్యారని అక్కడ పాఠశాలలో వసతులు కల్పించామన్నారు. ఉపాధ్యాయులు చాలా నిబద్ధతతో పనిచేస్తున్నారని సమన్వయం చేసుకుంటూ పక్కాగా విద్యార్థులకు బోధన అందేలా చర్యలు చేపట్టామన్నారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. వంటగది, పిల్లల రూమును పరిశీలించారు. కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. పూర్వ ప్రాథమిక పాఠశాల క్రింద అంగన్‌వాడీ పనిచేయాలని పిల్లలకు ఆట వస్తువులతో చిన్న చిన్న పాఠాలు సిలబస్ ప్రకారం బోధించాలని తెలిపారు. పిల్లల ఎదుగుదల నిరంతరం మానిటరింగ్ చేయాలని, పిల్లలకు రెగ్యులర్‌గా పౌష్టికాహారం అందించాలన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ, మండల ప్రత్యేకాధికారి డా॥ పురందర్, రఘునాథపాలెం తహసీల్దార్ ఎస్. శ్వేత, ఎంపిడివో అశోక్‌కుమార్, మండల విద్యాశాఖాధికారి బి. రాములు, గ్రామ కార్యదర్శి వై. రాంబాబు, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ బి. వెంకటలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ జి. విజయకుమారి, ఆయా శ్రావణి, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు వేమిశెట్టి మోహన్‌దాస్, సిద్దయ్య, సాధిక్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# తీరనున్న సాగునీటి కష్టాలు

(మొదటిపేజీ తరువాయి)

సంబంధించి పంపు హౌజ్‌ను ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి మంచుకొండ డబుల్ బెడ్‌రూం సముదాయం వద్ద పైపులైన్ ద్వారా నీటిని తరలించి స్టోరేజ్ చేసేలా ఏర్పాట్లు చేశారు. మంచుకొండ నుంచి మండలంలోని 33 చెరువుల నీటిని తరలించేందుకు పైపులైన్లను పూర్తి చేశారు. ప్రత్యేకంగా భూ సేకరణ అవసరం లేకుండానే అవసరం ఉన్న చోట రైతుల పొలాల్లోనే మూడు అడుగుల మేర లోతులో పైపులైన్ నిర్మించి సాగుకు కూడా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవడంతో రైతులు కూడా ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయలేదు. ఈ పథకం ద్వారా మండలంలోని 33 చెరువుల్లో నీరు నింపి సుమారు మూడువేల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించనున్నారు. చెరువులు నింపడం ద్వారా త్రాగునీటి సమస్యకు పరిష్కారం లభించడంతో పాటు భూ గర్భ జలాలు కూడా పెరగనున్నాయి. దశాబ్దాలుగా సాగునీటి కోసం ఎదురు చూసిన రఘునాథపాలెం మండల ప్రజల కల సాకారం కానుంది. మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందని కొన్ని ప్రాంతాలకు బుగ్గవాగు చెక్‌డ్యాం ద్వారా పైపులైన్ నిర్మించి చెరువుల్లో నీటిని నింపేందుకు అధికారులు ప్రతిపాదనలు సిద్దం చేశారు.

**రూ. 82 కోట్లతో బుగ్గవాగుకు ప్రతిపాదనలు :**

బుగ్గవాగు చెక్ డ్యాం ద్వారా కామేపల్లి, రఘునాథపాలెం మండలంలోని పలు చెరువులకు నీటిని అందించేందుకు రూ. 82 కోట్లతో ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేశారు. పదేళ్ల క్రితం బుగ్గవాగుపై చెక్ డ్యాం నిర్మించారు. ఆ తర్వాత గ్రావిటి కాలువల ద్వారా నీరు తరలించాలని భావించారు. ఇందు కోసం సుమారు రూ. 40 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్దం చేసిన భూ సేకరణతో పాటు ఇతరత్రా సమస్యల వల్ల కాలువల నిర్మాణం నిలిచిపోయింది. మంచుకొండ ఎత్తిపోతల పథకానికి సంబంధించి భూ సేకరణ అవసరం లేకుండానే ప్రత్యామ్నాయంగా పైపులైన్ నిర్మాణం ద్వారా చెరువులకు నీటిని అందించే ప్లాన్ సత్ఫలితాలను ఇచ్చింది. ఇప్పుడు అధికారులు బుగ్గవాగు చెక్‌డ్యాంపై దృష్టి సారించారు. మంచుకొండ ఎత్తిపోతల పథకం మాదిరిగానే బుగ్గవాగు చెక్‌డ్యాంకు సంబంధించి కూడా నీటి తరలింపుకు పైపులైన్ నిర్మిస్తే తక్కువ భూ సేకరణ వ్యయంతో పనులు పూర్తి చేసే అవకాశం ఉంటుందని అధికారులు ఆవైపు దృష్టిసారించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో సుమారు 26 కిలో మీటర్ల మేర పైపులైన్ నిర్మాణం భూ సేకరణ ఇతర పనులకు మరో రూ. 82 కోట్లు అవసరం అవుతాయని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి నివేదిక సమర్పించారు. ఆ ప్రతిపాదనను ప్రభుత్వం ఆమోదించి నిధులు మంజూరు చేస్తే కామేపల్లి మండలంలోని 21 చెరువులు, రఘునాథపాలెం మండలంలోని 10 చెరువులకు మొత్తం 31 చెరువులకు పైపులైన్ ద్వారా నీరు అందనుంది. సుమారు 200 క్యూసెక్యూల నీటిని తరలించి 5,500 ఎకరాలకు సాగునీరు అందనుంది. చెరువుల్లో నీటిని నింపడం ద్వారా సాగు, త్రాగునీటి సమస్యలు తీరడంతో పాటు సమీప ప్రాంతాల్లో భూ గర్భ జలాలు మెరుగుపడనున్నాయి. వర్షాకాలంలో వాగుల ద్వారా వచ్చే నీటిని చెక్ డ్యాం వద్ద స్టోర్ చేసి ఆపై చెరువులకు తరలిస్తే పంట చివరి దశలో నీటి ఇబ్బందులు ఉండవన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. ఇప్పటికే రఘునాథపాలెం మండలంలో మంచుకొండ ఎత్తిపోతల పథకం ద్వారా 33 చెరువులకు సాగర్ నీటిని అందిస్తుండగా మిగిలిన చెరువులకు కూడా బుగ్గవాగు చెక్‌డ్యాం ద్వారా నీటిని అందించనున్నారు. దీనితో మండలంలో సాగునీటి కష్టాలు తీరనుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# వీధి వ్యాపారుల ప్రాంగణాన్ని సౌకర్యవంతంగా తీర్చిదిద్దాలి

-మార్కెట్‌లో అవసరమైన వసతుల కల్పన
-పనులను పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వ్యాపారులు, కొనుగోలుదారులకు అనుగుణంగా సౌకర్యవంతంగా వీధి వ్యాపారుల ప్రాంగణంను తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. గురువారం ఖమ్మం పాత బస్టాండ్ ఎదురుగా ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణంలో జరుగుతున్న అభివృద్ధి పనులను అధికారులతో కలిసి కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పరిశీలించారు. మార్కెట్‌కు కావాల్సిన అదనపు వసతులు, అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులపై కలెక్టర్ పలు ఆదేశాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీధి వ్యాపారుల ప్రాంగణంలో కొనుగోలుదారుల రద్దీ దృష్ట్యా మరిన్ని వసతులు కల్పించాలన్నారు. మార్కెట్ బయట ఉన్న పబ్లిక్ టాయిలెట్స్‌ను మరో ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రస్తుతం బయట ఉన్న టాయిలెట్స్‌ను తీసివేసి రోడ్డు నుంచి మార్కెట్ లోపలికి అందంగా ఉండేలా చిన్న ఎత్తులో గోడ నిర్మించాలని ఆ గోడకు గ్రిల్స్ ఏర్పాటు చేసి పార్కింగ్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పబ్లిక్ టాయిలెట్స్ షిఫ్టింగ్ పనులు వారంలో, గోడ నిర్మాణం రెండు వారాల్లో పూర్తి చేయాలన్నారు. మార్కెట్‌లో ఏర్పాటు చేస్తున్న షెడ్ల నిర్మాణం స్త్రీ, పురుషులకు వేర్వేరుగా నిర్మిస్తున్న టాయిలెట్ల నిర్మాణ పురోగతిని మున్సిపల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద మహిళా వ్యాపారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. మార్కెట్‌లో ఉన్న వ్యాపారస్తులకు చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునేవిధంగా ఆర్థిక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో కార్పొరేట్ అసిస్టెంట్ కమిషనర్ షఫీవుల్లా, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, సంబంధిత అధికారుపాల్గొన్నారు.

# పేదల పక్షపాతి సిపిఐ

-పోరాటాల ద్వారానే ప్రజా సమస్యల పరిష్కారం
-సిపిఐ నగర కార్యదర్శి జానిమియా




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పోరాటాలు సాగించి పేదల పక్షపాతిగా సిపిఐ నిలిచిందని సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్‌కె జానిమియా తెలిపారు. గురువారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో సిపిఐ ఖమ్మం నగర ముఖ్య కార్యకర్తల సమావేశం ఏనుగు గాంధీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో జానిమియా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల ఫలితంగా పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందన్నారు. పోరాడి సాధించుకున్న హక్కులను హరించి వేస్తుందన్నారు. మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ వస్తుందన్నారు. 2025 సంవత్సరంలో కేవలం రూ. 69వేల కోట్లు కేటాయించడం వల్ల పని దినాలు తగ్గిపోయి గ్రామీణ ప్రాంతాల్లో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందిరమ్మ కమిటీలు సూచించిన వారికే ఇండ్లు కేటాయిస్తున్నారని నిజమైన అర్హులకు కేటాయించాలని కోరారు. రైతులకు రుణమాఫీ, రైతుభరోసా నిధులను వెంటనే విడుదల చేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని కోరారు. నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం పోరాటాలతోనే సాధ్యమవుతుందన్నారు. సమస్యలు పరిష్కరించని యెడల ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్, మేకల శ్రీనివాసరావు, పోటు కళావతి, పగడాల మల్లేష్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు వై. సాంబశివరెడ్డి, నూనె శశిధర్, గాదె లక్ష్మి నారాయణ, వరదా నర్సింహారావు, మహిళా సమాఖ్య నాయకురాలు తాటి నిర్మల, జిల్లా సమితి సభ్యులు ఎస్‌కె సైదా, నానబాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యను కాపాడాలి

-ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించాలి
-ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి





**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రభుత్వ విద్య మసకబారుతుందని దానిని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ తెలిపారు. గురువారం ఏఐఎస్ఎఫ్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం సిపిఐ కార్యాలయం గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది.ఈ సమావేశంలో ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఆర్భాటంగా ఫ్లెక్సీలు పెట్టి ఫోటోలు దిగి బడిబాట ప్రచారాన్ని నిర్వహిస్తే విద్యార్థులు ప్రభుత్వపాఠశాలలకు రారని ఆయన తెలిపారు. గత పదేళ్లుగా ఉపాధ్యాయుల నియామకాలు లేకపోవడం, ప్రైవేటు విద్యా సంస్థలను నియంత్రించకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టిసారించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం విద్యా వ్యతిరేక విధానాలను అవలంభించిందని ఈ ప్రభుత్వం కూడా అదే విధానాన్ని అనుసరిస్తుందన్నారు. ప్రభుత్వం కొలువుదిరి రెండేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు విద్యాశాఖ మంత్రిని కేటాయించకపోవడం శోచనీయమన్నారు. తక్షణమే ప్రభుత్వం విద్యారంగంపై దృష్టిసారించి ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శివ, మహేష్, నాగరాజు, ప్రతాప్, రాకేష్, నరేష్, గోపి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసీ కోర్సుల్లో బ్రౌన్స్‌కి బంగారు పతకాలు

విద్యార్థులను అభినందించిన కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్, విజయలక్ష్మి









**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండల పరిదిలోని తనికెళ్ల సమీపంలో అమ్మపాలెం పంచాయతీలోగల బ్రౌన్స్ కళాశాలలోని విద్యార్థులు బంగారు పథకాలు సాధించారు. ఇటీవల కాకతీయ విశ్వవిద్యాలయం ప్రకటించిన ఔషధశాస్త్రమునకు సంబందించిన ఎంఫార్మసీ, బిఫార్మసీ కోర్సుల్లో బ్రౌన్స్ ఫార్మసీ కళాశాలకు చెందిన విద్యార్థినీలు 7 బంగారు పథకాలు సాధించి కళాశాలకు మంచి పేరు తీసుకువచ్చారు. 2018 విద్యాసంవత్సరమునకు గాను ఎం ఫార్మసీ కోర్సులో వేముల సింధు బంగారు పథకం సాధించారు. 2019వ సంవత్సరం విద్యాసంవత్సరమునకు గాను బిఫార్మసీ కోర్సులో సముద్రాల రచన అత్యుత్తమ ప్రతిభకనబరిచి 4 బంగారు పథకాలు సాధించారు. 2021 విద్యాసంవత్సరమునకు గాను బిఫార్మసీ కోర్సులో మద్దోజు తేజశ్విని, కాటేపల్లి శివాని చెరొక బంగారు పథకాన్ని సాధించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ పారుపల్లి ఉషాకిరణ్, సెక్రటరీ పారుపల్లి విజయలక్ష్మి మాట్లాడుతు కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చని తమ కళాశాల విద్యార్థులు రుజువు చేశారని అన్నారు. తమ కళాశాలలోఉన్న సౌకర్యాలు, సదుపాయాలను ఉపయోగించుకొని విద్యార్థినీలు బంగారు పథకాలు సాధించారని అన్నారు. వారిని కష్టపడి చదివస్తున్న తల్లితండ్రుల కలలను సాకారంచేసే దిశగా వారు ప్రయాణిస్తున్నారని తెలిపారు. వారి తల్లితండ్రులతోపాటు కళాశాలకు చదువునేర్పిన గురువులకు కూడా మంచి పేరు తీసుకువచ్చారని పేర్కొన్నారు. ఈసందర్భంగా వారిని అభినందిస్తున్నట్లు తెలిపారు. బంగారు పథకాలను వచ్చేనెల 7 న కాకతీయ విశ్వవిద్యాలయం వరంగల్ స్నాతకోత్సవంలో అందజేయన్నుట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జగన్నాద్‌పాత్రో, పరిపాలనాధికారి సిహెచ్ హనుమంతురావు, కళాశాల అధ్యాపకబృందం పాల్గొని విద్యార్థినీలను అభినందించారు.

# గుదిమల్లలో వికసిత కృషి సంకల్పఅభియాస్



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని గుదిమల్లలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్పఅభియాస్ కార్యక్రమాన్ని రైతువేదికలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయవరిపరిశోధన సంస్థ ప్రిన్సిపల్, సైటింస్ట్ డాక్టర్ సిహెచ్ పద్మావతి మాట్లాడారు...సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటిస్తే వరిలో చీడపీడల ఉధృతి తగ్గించవచ్చన్నారు. వరిని ఆశించు దోమ, కాండం తొలుచు పురుగు, ఆకుముడుత, ఉల్లికోడు, కంకినపల్లి, అగ్గితెగులు, ఎండాకుతెగులు, పొట్టకుళ్లు వంటి యాజమాన్య పద్దతుల గురంచి తెలిపారు. అలాగే రైతులకు సాగు మెలుకువలపై అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఉమా నాగేశ్వరరావు, ఏఈఓ ఆదర్శ్, పంచాయతీ సెక్రటరీ మధు తదితరులు పాల్గొన్నారు.

# మూతబడిన పాఠశాలకు పూర్వ వైభవం

- 9మంది విద్యార్థులతో మరల డాక్యతండా పాఠశాల పునఃప్రారంభం



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ఖమ్మం రూరల్ మండలంలోని పొలిశెట్టిగూడెం పంచాయతీపరిధిలోని డాక్యతండలోని ప్రాథమిక పాఠశాలకు గురువారం పూర్వ వైభవం సంతరించుకుంది. జిల్లా కలెక్టర ముజమ్మిల్‌ఖాన్ ఆదేశాలతో అధికారులు చూపిన చొరవ ఫలించింది. గత రెండు సంవత్సరాలుగా జీరో ఎన్రోల్మెంట్‌తో మూతబడగా..తల్లిదండ్రులతో అధికారులు మాట్లాడి 9మంది విద్యార్థులరు బడిలో చేర్పించారు. దీనికి ఎంపిడీఓ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యి విద్యార్థులతో సాముహిక అక్షరాభ్యాసం చేపించడంతో పాటు పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, బ్యాగులు, పలకలు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ మూడ్ శ్రీనివాస్,పంచాయతీ కార్యదర్శి రజిత, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

# వానాకాలం రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలి



**ప్రజాపక్షం/ మధిర రూరల్ :** మధిర మండల పరిధిలో కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులు వానాకాలం రైతు భరోసాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి కనకం సాయిదీక్షిత్ తెలిపారు. రైతులు తమ పట్టాదార్ పాస్ పుస్తకం జిరాక్స్ లేదా డిజిటల్ సంతకం అయిన జిరాక్స్, ఆధార్‌కార్డు జిరాక్స్, బ్యాంక్ సేవింగ్ ఖాతా జిరాక్స్ దరఖాస్తు ఫారం పత్రాలను క్లస్టర్ వ్యవసాయ విస్తరణాధికారికి సమర్పించాలని తెలిపారు. జూన్ 5 2025 నాటికి భూ భారతి పోర్టల్‌లో ఉన్న పట్టాదార్ డేటా రైతు భరోసా పథకం కింద అర్హులైన రైతులకు సాయం అందించేందుకు భూ పరిపాలన ప్రధాన కమీషనర్ నుండి డిజిటల్ సంతకం అయిన రైతులు అర్హులని తెలిపారు. గతంలో రైతు భరోసా పొందిన రైతులు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదని తెలిపారు.

## పేదల సొంత ఇంటి కలను నెరవేర్చిన ప్రభుత్వం



**ప్రజాపక్షం/కరకగూడెం:** పేద ప్రజల సొంత ఇంటి కలను కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం నెరవేర్చిందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. గురువారం కరకగూడెం మండలం తాటిగూడెం గ్రామపంచాయతీ లోని ఇప్పచెట్టు గుంపు గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు దుర్గం కిరణ్ నూతనంగా నిర్మించే ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చింది కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అని అన్నారు. పేద ప్రజలకు న్యాయం జరగాలంటే అది ఒక కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యమన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డి నాయకత్వంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లుఆధ్వర్యంలో ప్రతి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారంగా ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలోమండల నాయకులు గాంధర్ల రామనాథం, దుర్గం కన్నయ్య, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు, యువకులు,అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్టీ కాలనీలో ఫీవర్ సర్వే



**ప్రజాపక్షం/మణుగూరు:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మణుగూరు ఆధ్వర్యంలో పగిడేరు పంచాయతీ పరిధిలో గల ఎస్టీ కాలనీ లో గురువారం ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ సీజనల్ వ్యాదుల పట్ల అప్రమత్తం గా ఉండాలని, నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, లార్వాలు చాలా చోట్ల ఉన్నాయని, వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం హెల్త్ క్యాంప్ నిర్వహించి మందులు అందజేశారు. సాంబాయిగూడెం ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ను డాక్టర్ నిశాంత్ రావు సందర్శించి రికార్డ్స్ ను పరిశీలించి తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో రాంప్రసాద్, కృష్ణ, సుజాత, కౌసల్య, కనకదుర్గ, రజని తదితరులు పాల్గొన్నారు.

## తాటి ఈశ్వరిని వరించిన కిష్టారం పిఎసిఎస్ పీఠం




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిధిలోని యాతాలకుంట గ్రామానికి చెందిన తాటి ఈశ్వరిని వరించిన కిష్టారం పిఎసిఎస్ పీఠం. గతంలో పిఎసిఎస్ చైర్మన్ గా ఉన్న మామిళ్ళపల్లి కృష్ణయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందటంతో, ప్రస్తుతం పిఎసిఎస్ కిష్టారం వైస్ చైర్మన్ గా ఉన్న తాటి ఈశ్వరిని అధ్యక్షురాలుగా సొసైటీ డైరెక్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం జరిగిన మాజీ అధ్యక్షుడు మామిళ్ళపల్లి కృష్ణయ్య సంస్మరణ సభలో కృష్ణయ్యకు సంతాపం తెలియజేశారు. డైరెక్టర్లు.అనంతరం సొసైటీ సభ్యులందరూ ఏకగ్రీవంగా తాటి ఈశ్వరిని కిష్టారం పిఎసిఎస్ సొసైటీ అధ్యక్షురాలుగా ఎన్నుకున్నారు. ఈ సదర్భంగా ఈశ్వరికి పలువురు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నరుకుళ్ళ అప్పారావు, జేష్ఠ అప్పారావు, పల్లె రామకృష్ణ, యాతాలకుంట మాజీ సర్పంచ్ తాటి మోహనరావు, మాజీ ఉపసర్పంచ్ వెచ్చా రాంప్రసాద్, సొసైటీ డైరెక్టర్ చింతాల లక్ష్మీ నారాయణ, బొమ్మ రెడ్డి విజయ్ కుమార్ రెడ్డి, తమ్మిన రవి, తుర్స భాను, సొసైటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జలగం వెంగళరావు వర్ధంతి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ జలగం వెంగళరావు 27వ వర్ధంతిని పెనుబల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. వీఎం బంజర్ రింగ్ సెంటర్లో గాంధీ విగ్రహం వద్ద జలగం వెంగళరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, జలగం అభిమానులు జలగం వెంగళరావుకి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఆరవ ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని ముందుకు నడిపించారని అన్నారు. అంతటి మహోన్నత వ్యక్తి ఖమ్మం జిల్లా, పెనుబల్లి మండలానికి చెందిన వ్యక్తిగా మనందరికీ గర్వకారణమని అన్నారు. జలగం వెంగళరావు విగ్రహం వియం. బంజర్ సెంటర్లో ఏర్పాటు చేసే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెనుబల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు, వంకాయలపాటి వెంకటేశ్వరావు, చీకటి రామారావు, పొట్లపల్లి వెంకటేశ్వరరావు, గూడూరు మాధవరెడ్డి, షేక్ కరిముల్ల, మేకతొట్టి కాంతయ్య, మాలోతు రాధాకృష్ణ, ఈడ కమలాకర్, వంగ దామోదర్, వంగ గిరిజాపతి, వేముల నరసింహారావు, గోపిశెట్టి వెంకటేశ్వరరావు, మిట్టపల్లి కిరణ్ కుమార్, వంగ వెంకటేశ్వరరావు, గోదా చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలను బడిలో చేర్పించండి

**- బాలకార్మిక రహిత జిల్లాగా తీర్చి దిద్దుదాం**
**- గోడపత్రిక ఆవిష్కరించిన అదనపు కలెక్టర్**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని , బాలకార్మికులుగా ఎవ్వరూ ఉండరాదని జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు అన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎయిడ్ సంస్థ ఆధ్వర్యంలో గోడ పత్రికను ఆయన గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సం.ప్రారంభమైనందున బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని, ఎవ్వరు కూడా పని ప్రదేశాల్లో ఉండరాదన్నారు. పిల్లలను పనిలో పెట్టుకుంటే చట్ట పరమైన చర్యలు తీసుకుంటాన్నారు. బడి బాట కార్యక్రమం ప్రారంభమైనందున తల్లిదండ్రులు,పిల్లలు, అధికారులు అంతా కలిసి నూరు శాతం బడిలో పిల్లలు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను బాలకార్మిక రహిత జిల్లాగా రూపొందించేందుకు కృషి చేయాలన్నారు. బాలకార్మిక పని ప్రదేశాలను గుర్తించి బడిలో చేర్పించాలని చెప్పారు. అంగన్వాడీ




కేంద్రాల ద్వారా పిల్లలకు పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ కమీషనర్ ఎండిఫోర్ఖోద్దీన్, జిల్లా బాలల రక్షణ అధికారి హరి కుమారి, డిసివియు యూనిట్ బాధ్యులు అజీజ్, నాగరాజు, ఎయిడ్ సంస్థ జిల్ల కో ఆర్డినేటర్ వి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

# జలగం సేవలు అందరికి ఆదర్శం

**ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు రాష్ట్రానికి చేసిన సేవలు అందరికీ ఆదర్శమని కొనియాడారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్ విజయ్ కుమార్. పట్టణంలోని జలగం వెంగళరావు పార్క్ లో జలగం వెంగళరావు వర్ధంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి హాజరై జలగం వెంగళరావు కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళ్ళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మాజీ ముఖ్య మంత్రి, అభివృద్ధి ప్రదాత, సర్దార్ జలగం వెంగళ రావు సత్తుపల్లి నియోజకవర్గ ప్రజలకు నాగార్జున సాగర్ కెనాల్ తవ్వించి,సాగు నీరందించి అపర భగీరదుడిగా ఆనాడు చేసిన సేవలు అందరికి ఆదర్శంగా నిలిచాయన్నారు. ఆయన చేసిన అభివృద్ధితోనే నేడు నియోజకవర్గానికి రాష్ట్రంలో ఒక గుర్తింపును సంతరించుకుందని కొనియాడారు. ఆ మహానుభావుడి విగ్రహానికి పూలమాల వేసి



నివాళులు అర్పించటం తనకి దక్కిన గౌరవంగా భావిస్తున్నానన్నారు ఎమ్మెల్యే. ఈ కార్యక్రమం లో సత్తుపల్లి మార్కెట్ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి పట్టణం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు పింగుల సామ్యూల్, కమల్ పాషా, ఐ.శ్రీను, ఉడతనేని అప్పారావు, పద్మజ్యోతి, రవీందర్ రెడ్డి, కంటే అప్పారావు, టోపి శ్రీను, అలవాల కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో లొంగిపోయిన ముగ్గురు మావోయిస్టులు

**- వారిపై రూ.19 లక్షల రివార్డు**
**- పునరావాసం కల్పించిన అధికారులు**

**ప్రజాపక్షం/భద్రాచలం :** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని నారాయణ్ పూర్ జిల్లాలో ఇద్దరు మహిళామావోయిస్టులతో సాహ ముగ్గురు మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. వారిలో భీమా అలియాస్ పోడియం, సుక్లి కొర్రం అలియాస్ సప్న, దేవి మాండవి ఉన్నట్లు పోలీస్ అధికారులు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ అడవుల్లో మావోయిస్టుల నిర్భంధం అధికం కావడటంతో పాటు మావోయిస్టు కార్యకలాపాలపై విసుకు చెందిన లొంగిపోయినట్లు అధికారులు తెలుపుతున్నారు. భీమా మావోయిస్టు పార్టీ సభ్యునిగా ఉంటూ హింసాత్మక కార్యకలాపాల్లో పాల్గొని పోలీసులే లక్ష్యంగా మావోయిస్టు నాయకుల ఆదేశాల మేరకు పనిచేసేవాడని, లొంగిపోయిన ముగ్గురిపై మొత్తం 19 లక్షల రివార్డు ఉంది. ఛత్తీస్‌గఢ్, పార్తాపార్ కాంకేర్ ప్రాంతాల్లో అధికంగా మహిళా మావోయిస్టులు ఉన్నారని, వీరు చురుకుగా పనిచేస్తుంటారని తెలుస్తోంది. నారాయణ్‌పూర్ పోలీసులు, ఐటిబిపి,పిఎస్ఎఫ్ జవాన్లు వీరి లొంగిపోయేందుకు కీలకపాత్ర పోషించారు. వీరి లొంగుబాటుతో మావోయిస్టు పార్టీ మరింతగా బలహీన పడిందని చెప్పారు. మావోయిస్టుల కంచుకోటగా చెప్పబడే అబూజ్మడ్‌లో పూర్తిగా మావోయిస్టు పార్టీని నిర్మూలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు నారాయణ్‌పూర్ ఎస్ఎస్‌పి ప్రభాత్ కుమార్ అన్నారు. లొంగిపోయిన మావోయిస్టులకు తక్షణ సహాయం క్రింద ఒక్కొక్కరికి రూ.50వేలు చొప్పున అందించామని, వారికి పునరావాసం కల్పిస్తామని ఆయన చెప్పారు. మావోయిస్టు పార్టీలో ఉండే వారంతా అజ్ఞాతాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిస్తే ప్రభుత్వం పరంగా పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ లొంగుబాటుతో తలిసి ఈ ఏడాది నారాయణ్‌పూర్ జిల్లాలో 104 మంది మావోయిస్టులు సాయుధ ఉద్యమాన్ని వీడారని, గత సం.బస్తర్ ఏడు జిల్లాల పరిధిలో 792 మంది మావోయిస్టు లొంగిపోయారని చెప్పారు.

## 27న పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులు



**ప్రజాపక్షం/మణుగూరు:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మణుగూరు డిపో వారిచే పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సులను ఈ నెల 27న డీలెక్స్ బస్సును ఏర్పాటు చేయడం జరిగిందని మణుగూరు డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. మణుగూరు నుండి ఉదయం 6 గంటలకు బయలుదేరి మరుసటి రోజు తెల్లవారుజామున రెండు గంటలకు వస్తుందని, ఈ పుణ్యక్షేత్రాల్లో మల్లూరు శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, అక్కడి నుండి బొగత జలపాతం అక్కడి నుండి మేడారం సమ్మక్క సారలమ్మ తల్లి దర్శనం చేసుకుని రామప్ప ఆలయం అక్కడి నుండి వేయి స్తంభాల గుడి భద్రకాళి ఆలయాన్ని దర్శించుకొని తిరిగి మణుగూరు చేరుకుంటుందని తెలిపారు. ఒకేరోజులో ఐదు ఆలయాలను దర్శించుకొని రావచ్చునని, పెద్దలకు 1000 పిల్లలకు 500 మాత్రమే ఈ సదవకాశాన్ని మణుగూరు ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. అలాగే అన్నవరం సత్యనారాయణ స్వామి అక్కడినుండి ద్రాక్షారామం, వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయం, ద్వారకాతిరుమల నుండి మణుగూరు చేరుకుంటుందని, ఈ బస్సు 27వ రాత్రి 11 గంటలకు బయలుదేరి తెల్లారి 28వ తేది రాత్రి ఒంటిగంటకు మణుగూరు చేరుకుంటుందని, సూపర్ లగ్జరీ బస్సు పెద్దలకు 1400/, పిల్లలకు 700/గా నిర్ణయించబడిందని వివరాలకు 9959225963 7382858121 6305335304లను సంప్రదించాలన్నారు. 30 మంది ప్రయాణించినట్లయితే ఏ రోజైనా బస్సును ఇవ్వడం జరుగుతుందని, ఆన్లైన్లో రిజర్వేషన్ చేసుకోవచ్చునని తెలిపారు.

# పేద వర్గాలకు ఎర్రజెండానే అండ

**సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి,అయోధ్య**

**ప్రజాపక్షం/మణుగూరు:** పేద ప్రజలకు అండగా ఎర్రజెండా నిలుస్తుందని దాని హక్కుల సాధన కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తుందని దీనికి అందరూ అండగా నిలవాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి అయోధ్య పిలుపునిచ్చారు. గురువారం విజయనగరం గ్రామం, బెస్తగూడెం గ్రామంలో బాడిస చెన్నారావు అధ్యక్షత వహించగా గొల్ల కొత్తూరులో సిపిఐ గ్రామ శాఖ సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాలకు ముఖ్యఅతిథిగా హాజరైన బి.అయోధ్య హాజరై మాట్లాడుతూ అధికారంలో ఉన్న లేకున్నా కార్మికుల పక్షాన, కర్షకుల, పక్షాన రైతులు, వ్యవసాయ కూలీల పక్షాన సిపిఐ నిలబడి వారికోసం పోరాటాలు కొనసాగిస్తుందని, 100 సంవత్సరాల సుదీర్ఘ పోరాట చరిత్ర కలిగిన పార్టీ ఎర్రజెండా సిపిఐ ఒకటే అన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీకి అండగా నిలుస్తూ వారిని గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈనెల 26వ తేదీన గురువారం మణుగూరు కిన్నెర కల్యాణ మండపంలో జరుగు మణుగూరు మండల



పట్టణ మహాసభను జయప్రదం చేయాలని ఈ మహాసభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కె. సాబీర్ పాషా హాజరు కానున్నారని కావున పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిపిఐ పినపాక నియోజకవర్గ కార్యదర్శి సరెడ్డి పుల్లారెడ్డి, మాజీ ఎంపీపీ ఎడారి రమేష్, మాజీ సర్పంచ్ పాయం కామరాజు, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, నాయకులు పులిగల రమేష్, ఎం వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కమిటీలు ఎన్నుకున్నారు.

# మోగిన బడి గంట

**-పాఠశాలలకు పరుగులు పెట్టిన చిన్నారులు**
**-పచ్చటి తోరణాలతో స్వాగతం పలికిన పాఠశాలలు**
**-పలు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాల పంపిణీ**



**ప్రజాపక్షం/పినపాక:** మండల వ్యాప్తంగా బడి గంట మోగడంతో చిన్నారులు గురువారం పాఠశాలలకు ఉరుకులు, పరుగులు పెట్టారు.సెలవులతో సరదా సరదాగా గడిపిన విద్యార్థులు ఆటవస్తులను పక్కన పడేసి పుస్తకాలను పట్టారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలన్నీ తెరుచుకున్నాయి. ఎండాకాలం సెలవులతో దాదాపు 48 రోజుల పాటు ఆటపాటలతో అల్లరి చేసిన విద్యార్థులు బుద్ధిగా పాఠశాలలకు వెళ్లారు. దీంతో ఇంతకాలం బోసిపోయిన పాఠశాలల ప్రాంగణాలు, తరగతి గదులు విద్యార్థులతో కళకళలాడాయి. అంతేకాకుండా చాలా రోజుల తర్వాత ఉదయం వేళా రోడ్లన్నీ బిజీబిజీగా మారాయి. ఆటోలు, స్కూల్ బస్సులు, మ్యాజిక్ వంటి ద్విచక్ర వాహనాలపై తొలి రోజు విద్యార్థులు కేరింతలు కొడుతూ ప్రయాణించారు. సెలవుల్లో ఉదయం 9 గంటలు దాటిన నిద్రలేవని ఆ చిన్నారులు బడులు ప్రారంభంతో తెల్లవారుజామునే నిద్రలేచి ముద్దుగా ముస్తాబై పాఠశాలలకు బయలుదేరి వెళ్లారు. కొంతమంది చిన్నారులు స్కూలుకు వెళ్లేందుకు మారం చేయడంతో తల్లిదండ్రులు బుజ్జగించి పాఠశాలకు పంపారు.తొలి రోజు పాఠశాలకు చేరుకున్న విద్యార్థులు అక్కడ కొత్త తరగతిలో పాత స్నేహితులతో తొలిరోజు సరదా సరదాగా



గడిపారు. ఈ సంవత్సరం విద్యార్థులందరికీ ఇప్పటివరకు పాఠ్యపుస్తకాలతో పాటు స్కూల్ డ్రెస్సులను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్న విషయం తెలిసిందే.. అయితే ఈ ఏడాది నుంచి వీటితో పాటు నోట్ పుస్తకాలను కూడా అందజేయనున్నారు. అంతేకాకుండా మధ్యాహ్నం భోజనం పథకంలో భాగంగా అన్ని రకాల పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించేందుకు విద్యార్థులకు ఒకరోజు కిచిడి, మరో రోజు పప్పు, కూరగాయలతో పెట్టనున్నారు. అంతేకాకుండా గత ఏడాది వరకు ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియంలో బోధనలను ప్రవేశపెట్టారు. తద్వారా ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు పైసా ఖర్చు లేకుండా అన్ని ప్రభుత్వామే భరిస్తూ పూర్తి నాణ్యమైన విద్యను అందిస్తోంది. ఇందులో భాగంగా చర్యలు తీసుకున్నారు. అంతేకాకుండా మన బస్తి మనబడి కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో ఇప్పటికే పలు పాఠశాలను అభివృద్ధి చేయడంతో పాటు కనీస సౌకర్యాలను కల్పించారు. పాఠశాలలు పున ప్రారంభం కావడంతో పినపాక మండలంలోని ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. పాఠ్యపుస్తకాలు, నోటు బుక్స్ లకే,వేల రూపాయలను యాజమాన్యాలు వసూలు చేస్తున్నారు. వీటికి తోడు స్కూల్స్ డ్రెస్సులు, సాక్స్ లకు అదనపు ఖర్చు అవుతుంది. మరో వైపు ఫీజులను మరింత భారంగా మారడంతో విద్యార్థుల తల్లిదండ్రులు పైసల కోసం తిప్పలు పడుతున్నారు.చిన్న చితక ఉద్యోగులు బ్యాంక్ రుణాల కోసం ఆశ్రయిస్తుండగా రోజువారి కూలీలు తెలిసిన వారి వద్ద అప్పులకు క్యూ కడుతున్నారు.

## 14న సిపిఐ నియోజకవర్గ కార్యాలయం ప్రారంభం

**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** అశ్వారావుపేట నియోజకవర్గం సిపిఐ కార్యాలయం అమరజీవి మహమ్మద్ రజబలి భవన్ నామకరణంతో ప్రారంభిస్తున్నట్లు సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సలీం తెలిపారు. గురువారం అశ్వారావుపేటలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంలోని పామాయిల్ ఫ్యాక్టరీ ఎదురుగా ఖమ్మం రోడ్‌లో నూతనంగా నిర్మించిన భవనాన్ని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి ఎస్కే షాబిర్‌బాషా ప్రారంభిస్తారని తెలిపారు. ఈ ప్రాంతంలో కామ్రేడ్ అమరజీవి సయ్యద్ జానిమియా ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు నిర్వహించి పేదల పక్షాన నిలబడిన మహనీయులు ఈ ప్రాంత దోపిడి దాడులను భూ స్వాములకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించి కార్మికులు కర్షకులు పేదల పక్షాన నిలబడి ఎందరికో ఇళ్ల స్థలాలు ఇప్పించటంలో భూములు అప్పగించడంలో కీలక పాత్ర పోషించారన్నారు. ఈ ప్రాంతంలో నియోజకవర్గ స్థాయి సిపిఐ కార్యాలయ భవనాన్ని ఏర్పాటు చేసుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని అన్నారు. అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రం ఉండటం పోరాటాలకు ఎంతో ఉపయోగం కలిగిస్తుందన్నారు. ముఖ్యంగా సిపిఐ ఆధ్వర్యంలో సమరశీల పోరాటాలను నిర్వహించిన





ఘనత ఈ ప్రాంతంలో ఉందన్నారు. అదేవిధంగా 14న నూతనంగా ప్రారంభమయ్యే కార్యాలయంలో మండల మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మహాసభకు కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు సకాలంలో హాజరు కావాలని కోరారు. ఈ సమావేశంలో డివిజన్ కార్యదర్శి సయ్యద్ జాకీర్, పట్టణ కార్యదర్శి నూకవరపు విజయ్, ఎఐటియుసి నాయకులు పటాన్ జలాల్, టౌన్ జాయింట్ సెక్రటరీ జక్కం బలరాం తదితరులు పాల్గొన్నారు.

## ఫామ్ ఆయిల్ మొక్కల పంపిణీ



**ప్రజాపక్షం/అశ్వాపురం:** మెగా ప్లాంటేషన్ డే సందర్భంగా జిల్లా హార్టీ కల్చర్ అధికారి కిశోర్, డివిజన్ అధికారి రాధాకృష్ణ పిలుపు మేరకు ఆయిల్ ఫెడ్ అధికారులు అశ్వాపురంలో రైతులకు 80 శాతం సబ్సిడీపై ఫామ్ ఆయి ల్ మొక్కలను పంపిణీ, మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. అశ్వాపురం మండలంలో దాదాపు 400 ఎకరాలు సాగుతుండగా విస్తీర్ణం భారీగా పెంచేందుకు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలను వినియోగించుకోవాలని ఆయిల్ ఫెడ్ అధికారులు పిలుపునిచ్చారు. మొక్కలకే కాకుండా డ్రిప్ ఇరిగేషన్ పరికరాలపై కూడా సబ్సిడీ వస్తుందన్నారు. అంతే కాకుండా ఎకరానికి రూ 4200 చొప్పున ప్రోత్సాహకం ఇవ్వడం జరుగుతుందన్నారు. అంతర్గత పంటలపై అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈకార్యక్రమంలో ఆయిల్ ఫెడ్ అధికారులు వికాస్, ప్రవీణ్, రైతులు ఓరుగంటి బిక్షమయ్య, గాదె కేశవరుడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, ఈదర అప్పారావు, కందుల ప్రసాదరావు, ముప్పారపు సత్యనారాయణ, రాయల కృష్ణ, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ మండల కార్యదర్శిగా పుచ్చకాయల



**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లి మండల సిపిఐ కార్యదర్శిగా మండల పరిధిలోని తాళ్లగూడెం గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ నాయకులు పుచ్చకాయల వెంకటేశ్వర్లు ఐదవ సారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల మహాసభలో మండల పార్టీ ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకుంది. మండల సహాయ కార్యదర్శి పుచ్చకాయల వెంకటకృష్ణను ఎన్నుకున్నారు. అదే విధంగా మండల కార్యవర్గ సభ్యులు, కౌన్సిల్ సభ్యులను ఏకగ్రీవంగా ఎనుకోవడం జరిగింది. ఈసందర్భంగా మండల కార్యదర్శిగా ఎన్నికైన పుచ్చకాయల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలంలో ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

## జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/ములకలపల్లి:** కొత్తగూడెం కోర్టు ఆవరణలో రేపు శనివారం నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను బ్యాంక్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బిఐ పూసుగూడెం బ్రాంచ్ మేనేజర్ రాజేంద్ర నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాంకులో మొండి బకాయిలు ఉన్న వినియోగదారులు కొత్తగూడెం కోర్టులో జరిగే జాతీయ అదాలత్ ద్వారా వన్ టైం సేటిల్మెంట్ చేసుకోని లబ్ది పొందవచ్చు అని తెలిపారు. వివరాలకు స్థానిక బ్యాంకును సంప్రదించాలని తెలిపారు.

## అమ్మ ఒడిలాంటిది అంగన్వాడీ



**ప్రజాపక్షం/ములకలపల్లి:** అమ్మ ఒడి లాంటిది అంగన్వాడీ అని సూపర్వైజర్ నాగమణి అన్నారు. గురువారం జగన్నాధపురం సెక్టార్ కొమ్ముగూడెం అంగన్వాడీ కేంద్రంలో అమ్మ మాట, అంగన్వాడీ బాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామాలలో అమ్మమాట అంగన్వాడీ బాట నినాదాలు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసిడిఎస్ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పిల్లల ఎదుగుదల అంగన్వాడీతోనే ప్రారంభం అవుతుందని, అంగన్వాడీ పిల్లల విద్యకు మొదటి అడుగు వేస్తుందని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉన్నాయని, పెరటి తోటలు పచ్చదనంతో నిండి ఉన్నాయని తెలిపారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు ధీటుగా విద్యా బోధన అందిస్తున్న విధానంపై తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ, అంగన్వాడి కేంద్రాల శుభ్రంగా ఉంచుకోవడం జరుగుతుందన్నారు. ఈరోజే మీ పిల్లలను అంగన్వాడీలో చేర్పించాలని తెలిపారు. ఈకార్యక్రమంలో తదితరులు అంగన్వాడీ టీచర్లు సత్యవతి, రాజేశ్వరి, బాలామణి, వాణి, తిరుపతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## ఛత్తీస్‌గఢ్ సుక్మా జిల్లాలో ఎదురు కాల్పులు

**- ఇద్దరు మావోయిస్టులు మృతి**

**ప్రజాపక్షం/భద్రాచలం :** సుక్మా జిల్లాలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టుతో సహ ఇద్దరు మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఘటన ఆ జిల్లాలోని పుస్గున్న అటవీ ప్రాంతంలో చోటు చేసుకుంది. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా సంయుక్త బలగాలు అడవులను జల్లెడుపడుతున్న క్రమంలో మావోయిస్టు పార్టీ సభ్యులు తారసపడటంతో ఇరు వర్గాల నడు హోరాహోరీగా కాల్పులు చోటు చేసుకున్నాయి. కాల్పుల అనంతరం సంఘటనా స్థలాన్ని పరిశీలించగా ఎల్ఓఎస్ కమాండర్ ముచాకీ, పార్టీ సీనియర్ సభ్యురాలు అనితా మృతదేహాలు లభ్యమైనట్లు పోలీస్ అధికారులు ధృవీకరించారు. మృతదేహాలతో పాటు ఇన్సాస్ రైఫిల్ , భారీ పేలుడు పదార్థాలు, విప్లవ సాహిత్యం లభ్యమయ్యాయి. మృతి చెందిన మావోయిస్టులపై రూ.5 లక్షల రివార్డు ఉంది.

# ప్రత్యామ్నాయ స్థలంలో శ్మశానవాటిక ఏర్పాటు

**-కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్**



**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్:** ప్రత్యామ్నాయ ప్రభుత్వ స్థలంలో శ్మశానవాటిక ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం ఖమ్మంరూరల్ మండలం జలగంనగర్‌లోని మున్నేటి సమీపంలో గల డాడీ లంబాడ శ్మశనావాటికను అధికారులు, స్థానిక ప్రజలతో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...వరదల నుండి రక్షణ కోసం నిర్మించే కరకట్ట డిజైన్‌లో ఎటువంటి మార్పులు, తగ్గించడం అవసరం లేదన్నారు. సర్వే నెంబర్ 156, 167లో ఉన్న 30గుంటల పట్టా భూమిలో ప్రస్తుతం శ్మశానవాటిక ఉందని, కరకట్టు నిర్మాణంలో శ్మశానవాటిక భూమి కొంత మేరకు కోల్పోతున్నందున, కొత్తగా సమీపంలోని ప్రభుత్వ భూమిలో శ్మశానవాటిక ఏర్పాటు చేసి అక్కడ రోడ్డు, కంపౌండ్‌వాల్ ఇతర సౌకర్యాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకోసం సమీపంలోని ప్రభుత్వ భూములను పరిశీలించి వారంరోజులలో అనుకూలమైన స్థలం ఎంపిక చేసి ప్రతిపాదనలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మంరూరల్ తహశీల్దార్ రాంప్రసాద్, ఎంపిడీఓ కుమార్, కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డి, ఎస్‌హెచ్‌ఓ ముష్కరాజు పాల్గొన్నారు.

# 100 రోజుల ప్రణాళిక పనులను పకడ్బందీగా నిర్వహించాలి

**- అదనపు కలెక్టర్ శ్రీజ**



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ ప్రభుత్వం మున్సిపాల్టీల్లో అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 100 రోజుల ప్రణాళిక అభివృద్ధి పనులను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్, మున్సిపాల్టీ స్పెషలాఫీసర్ శ్రీజ అధికారులను ఆదేశించారు. గురువారం మధిర మున్సిపాల్టీలో ఆమె విస్తృతంగా పర్యటించారు. ఈ పర్యటనలో భాగంగా మధిర రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ప్రజలకు జరుగుతున్న అసౌకర్యాన్ని తెలుసుకుని ఆ ప్రదేశాన్ని సందర్శించి అక్కడ కల్వర్టు నిర్మాణానికి పరిపాలనపరమైన అనుమతి ఇవ్వడం జరిగింది. స్థానిక ప్రజల విజ్ఞప్తి మేరకు త్వరలోనే పనులు చేపట్టాలని రైల్వే అధికారులను, మున్సిపల్ కమీషనర్‌ను ఆదేశించారు. అలాగే మున్సిపాల్టీ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా పారిశుద్ధ్యం, కాల్వ పూడిక తీత పనులు, వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై, ఇతర సమస్యలపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ సంపత్‌కుమార్, మున్సిపాల్టీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలలు పునఃప్రారంభంతో పేదల హర్షం



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని మూతబడిన పాఠశాలలో పున ప్రారంభంతో గ్రామీణ పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని ఓబుల్ రావు బంజర, పాయపూర్, లక్ష్మీ పురం గ్రామాలలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పున ప్రారంభంతో పాటు మౌలిక వసతులు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడం పట్ల గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు ఎక్కువగా ఉండగా గత మూడు సంవత్సరాలు క్రితం పాఠశాలలో విద్యార్థులు లేనందున మూతబడినాయి. ప్రభుత్వ ఉపాధ్యాయులు కృషితో గత వారం రోజుల క్రితం బడిబాట కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించారు. దీనిలో భాగంగా కాంప్లెక్స్ హెచ్‌ఎం మధు, షేక్ చాంద్ పాషా, ఉపాధ్యాయ సిబ్బంది ప్రత్యేకమైన కృషితో విద్యార్థుల సంఖ్య పెరగడం జరిగిందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలుపుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలో ఏకరూప దుస్తులు, మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, షూ, టై, బెల్ట్ ప్రత్యేక సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రామాల్లో అధికమైన ప్రచారం చేయడం వలన విద్యార్థుల సంఖ్య పెరిగినట్లు తల్లిదండ్రులు పేర్కొంటున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో పట్టుదలతో ప్రతిరోజు పాఠశాలకు హాజరై ఉత్తమ బోధన బోధించి మంచి పేరు తీసుకురావాలని తల్లిదండ్రులు ఉపాధ్యాయులను కోరుతున్నారు. ఇదే విద్యార్థుల హాజరు శాతాన్ని ఈ విధంగా తగ్గకుండా ఉంచాలని విద్యార్థులు తల్లిదండ్రులు కోరుతున్నారు. పాఠశాలలు పునః ప్రారంభానికి విశేషమైన కృషి చేసిన ఆర్డిఓ, ఎంఈఓ, ఎంపీడీవో, తహశీల్దార్ లకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.

# చదువుతోనే బంగారు భవిష్యత్ : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** చదువుతూనే బంగారు భవిష్యత్తు ఉంటుందన్నారు సత్తుపల్లి శాసన సభ్యురాలు డా. మట్టా రాగమయి దయానంద్ విజయకుమార్. గురువారం పట్టణంలోని జలగం నగర్ అంగన్ వాడీ కేంద్రంలో అమ్మ మాట అంగన్ వాడీ బాట కార్యక్రమంను ఎమ్మెల్యే రాగమయి ప్రారంభించి, 20 మంది చిన్నారులతో సామూహిక అక్షరాభ్యాసం చేపించి, చిన్నారులకు యూనిఫాంలు, పలక బలపములు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారులకు, గర్భిణీలకు, బాలింతలకు నాణ్యత గల పోషకాహారం అందిస్తూ, చిన్నారులకు ఆట, పాటలతో కూడిన ఆహ్లాదకరమైన మంచి చదువు అందిస్తున్నారని, చిన్నపిల్లలను అంగన్‌వాడి కేంద్రాలలో చేర్పించి చిన్నారుల బంగారు భవిష్యత్ కు తల్లిదండ్రులు బాటలు వేయాలని కోరారు. చిన్నారులకు అమ్మ ఒడి తరువాత వారి ఆలనా, పాలనా చూసుకునేది అంగన్ వాడీ టీచర్లు, ఆయాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, పింగుల సామ్యూల్, కమల్ పాషా, ఐ సి డి ఎస్ సిడిపిఓ మెహరున్నీసా, సూపర్ వైజర్లు గంగాజలం, సుజాత, రజిని పాల్గొన్నారు.

# మృతుల కుటుంబాలకు పొంగులేటి ఆర్థికసాయం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆర్థిక సహాయం ను స్థానిక నాయకులు అందించారు. మండలం లోని పలు గ్రామాలలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు రూ.10 వేల చొప్పున పలు బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం ను అందించారు. ఈ సందర్భంగా నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు మాట్లాడారు.. మృతుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు మంత్రి శ్రీనివాసరెడ్డి భరోసా కల్పిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు కొడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, కుక్కల హనుమంతరావు, మాజీ సర్పంచ్లు పెంటమళ్ల పుల్లమ్మ, రాయపూడి నవీన్, వంగవీటి నాగేశ్వరరావు, మామిడి వెంకన్న, బోడ్డు బోందయ్య, మేకల వేంకటేశ్వర్లు, కొమ్మినేని విజయ్ బాబు,కడియల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలను పనిలో చేరిస్తే చర్యలు తప్పవు



**ప్రజాపక్షం/ మధిర :** బాల కార్మికులను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్, మధిర కోర్టు సీనియర్ సివిల్ జడ్జి ఎన్.ప్రశాంతి అన్నారు. అంతర్జాతీయ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందరర్భంగా మధిర కోర్టు ప్రాంగణంలో గురువారం న్యాయ చైతన్య సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బాల హక్కులను పరిరక్షించడం మనందరి బాధ్యత అని, వారిని విద్యారంగంలో అభివృద్ధి చేయడం ద్వారా సమాజంలో గౌరవం తీసుకురావాలని బాలల హక్కులపై సోదాహరణంగా వివరించారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వేముల దీప్తి మాట్లాడుతూ బాల కార్మికులను పనిలో పెట్టుకోకుండా మనమందరం ముందుగా బాధ్యత తీసుకోవాలని సూచించారు. మధిర ప్రాంతంలో ఏ షాపులో, ఇంట్లో అయినా ఎట్టి పరిస్థితుల్లో పనిలో పెట్టకోకుండా చూడాలన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మధిర కార్మిక అధికారి కె.చందర్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బోజెడ్ల పుల్లారావు, సీనియర్ న్యాయవాదులు వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, వాసంశెట్టి కోటేశ్వరరావు, నంబూరి జనార్ధన్‌రావు, దిరిశాల జగన్మోహన్‌రావు, జె.రమేష్, కోర్టు సిబ్బంది, పారాలీగల్ వాలంటీర్స్, పట్టణ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం




**ప్రజాపక్షం/ మధిర :** ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా హ్యూమన్ రైట్స్ సొసైటీ సభ్యులు కోట వెంకట్, కెవిఆర్ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ 14 సంవత్సరాల లోపు పిల్లలందరూ బడిలో చదువుకోవాలని, బాలల హక్కుల్లో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచిత విద్య, భోజనం, అందచేయటం జరుగుతుందని తెలిపారు. పలక, బలపం పట్టాల్సిన వయస్సులో కార్మికులుగా ఉండరాదని, కార్మికులుగా ఎవరైనా ఉంచినట్లయితే తల్లి దండ్రులపై, యజమానిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవటం జరుగుతుందని తెలిపారు. భారమైన శ్రమకు బలైపోతున్న బాల బాలికల చేత పలక బలపం పట్టిస్తే ఎంతోమంది వివిధ రంగాల్లో ఉన్నతస్థాయికి ఎదిగి సమాజంలో గౌరవంగా బ్రతుకుతారని అన్నారు. పట్టణం, గ్రామాల్లో ఎవరైనా బాల కార్మికులను గుర్తించినట్లయితే వెంటనే పోలీసులు, ఐసిడిఎస్ అధికారులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామపంచాయతీ సెక్రటరీలకు సమాచారం అందించాలని, బాల కార్మికుల నిర్మూలనకు ప్రతిఒక్కరూ తోడ్పాటు అందించాలని కోరారు.

# ప్రారంభమైన బడులు

**- తొలిరోజు ప్రభుత్వ బడుల్లో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ**



**ప్రజాపక్షం/ మధిర :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జూన్ 12 పాఠశాలలు పునప్రారంభం సందర్భంగా గురువారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలను ప్రారంభించారు. పాఠశాలలకు వచ్చే పిల్లలను ఆకర్షించేందుగా ప్రత్యేకంగా బడులను అలంకరించి స్వాగతం పలికారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు ప్రభుత్వ బడులకు వచ్చిన విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో ప్రైవేట్ పాఠశాలలకు పంపించే తమ పిల్లల ఖర్చులతో తల్లిదండ్రులు సతమతమవుతున్నారు. ప్రైవేట్ స్కూల్స్‌లో వేల రూపాయలు పెట్టి పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్, నోట్ బుక్స్ కొనాల్సిన పరిస్థితి ఉండటంతో మధ్య తరగతి, సామాన్య తల్లిదండ్రులు అప్పులు తెచ్చి మరి తమ పిల్లలను చదివిస్తుండటంతో ఆర్థికంగా మోయలేని భారాన్ని మోస్తున్నారు. ఏదీ ఏమైనా విద్యా సంవత్సరం ప్రారంభం కావటంతో పాఠశాలల్లో, విద్యార్థుల్లో సందడి నెలకొంది.

# విద్యార్థులు కష్టపడి చదివితే మంచి భవిష్యత్



**ప్రజాపక్షం/ అశ్వారావుపేట :** విద్యార్థులు కష్టపడి చదివితే మంచి భవిష్యత్ ఉంటుందని, ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు సకల సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ అన్నారు. గురువారం పాఠశాలల పున ప్రారంభం కావటంతో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలతో పాటు నోట్‌బుక్స్, ఏకరూప దుస్తులను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కల్పిస్తున్న వసతి సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ప్రవీణ్‌కుమార్, హెచ్‌ఎం ప.హరిత, సిఐ నాగరాజు, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏకరూప దుస్తులు పంపిణీ



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలలో విద్యార్థులకు ఎస్‌ఈఆర్‌పి సిబ్బంది ద్వారా మహిళా సంఘాలచే కుట్టించబడిన ఏకరూప దుస్తులను జూలూరుపాడు ఎంఈవో జిమ్మిలాల్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ విషయమై జిల్లా కలెక్టర్ గత నెల రోజులుగా డిఆర్‌డిఏ, ఐకెపి సిబ్బంది ద్వారా అన్ని రకాల ఏర్పాట్లు చేయించి మహిళా సంఘాల్లోని టైలర్లతో ఏకరూప దుస్తువులను కుట్టించడం జరిగిందన్నారు.

# సిఎంఆర్ రైస్ కోసమే వైరాలో రీసైక్లింగ్

**-చిన్న చిన్న వాహనాల ద్వారా మిల్లుకు తరలింపు**
**-రేషన్ షాపుల వద్ద నుండే బియ్యం తరలింపు**




ప్రజాపక్షం/వైరా: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని సిఎంఆర్‌ఎస్ రైస్ అందించేందుకు మిల్లర్లకు సరఫరా చేసింది. ఇదే సమయాన్ని ఆసరా చేసుకున్న వైరా, కొణిజర్ల మండలాల్లోని కొంతమంది మిల్లర్లు ప్రజాపంపిణీ బియ్యాన్ని కొందరి వ్యక్తుల ద్వారా తీసుకొని ఆ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి ప్రభుత్వానికి అందించేందుకు ఓ పక్కా ప్రణాళికను ఏర్పాటు చేసుకున్నారు. వైరాలోని కొన్ని రేషన్ షాపు డీలర్ల వద్ద నుండి దళారుల ద్వారా నేరుగా రేషన్ బియ్యాన్ని మిల్లుకు తెప్పించి వాటిని రీసైక్లింగ్ చేసి సిద్ధం చేస్తున్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలో పలు ప్రాంతాల్లో ఉన్న మిల్లులు, నిర్వాహకులు ఈ రేషన్ బియ్యాన్ని తీసుకొని సరికొత్త దందాకు తెర లేపుతున్నారు. ఎవరికి ఎక్కడ ఎలాంటి అనుమానం రాకుండా ఈ రేషన్ దందాను కొనసాగిస్తూ సిఎంఆర్ రైస్‌ను అప్పగించేందుకు ఓ సరికొత్త ప్రణాళికను రచించారు. తీసుకున్న ధాన్యానికి బదులుగా రైస్ ఇచ్చేటప్పుడు ఎవరు పరిశీలించేది అనేది వాళ్లలో ఉన్న ఒక గొప్ప నమ్మకమే ఇవాళ సిఎంఆర్ రైస్‌కు బదులుగా రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేస్తున్నారు. లారీల ద్వారా పంపించినప్పుడు లారీలో ఉన్న లాట్‌ను క్షుణ్ణంగా పరిశీలించిన సందర్భాలు లేకుండా అక్కడ దళారీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ వైరాలో రీసైక్లింగ్ దందా చాప కింద నీరులా విస్తరిస్తుందని చెప్పవచ్చును. చిన్న చిన్న మోటార్ సైకిల్ ద్వారా ఆటోల ద్వారా నేరుగా రేషన్ షాపుల వద్ద నుండే మిల్లుకు తరలిస్తున్నారు. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు నామమాత్రంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. వైరా మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఉన్న కొన్ని రేషన్ షాపులు నిర్వాహకులు మున్సిపాలిటీ పరిధిలోని ఆ మిల్లుకు బియ్యాన్ని సరఫరా చేస్తున్నారు. రాత్రిపూట ఎవరూ లేని సమయంలో రేషన్ షాపుల వద్ద నుండి చిన్న చిన్న వాహనాల ద్వారా ఎవరికి ఎలాంటి అనుమానం రాకుండా ఈ దందాని కొనసాగిస్తున్నారు.

## భట్టిని కలిసిన నూతి సత్యనారాయణ



ప్రజాపక్షం/వైరా: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కను గురువారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసిన పిసిసి ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల ప్రకటించిన తెలంగాణ పిసిసి ప్రధాన కార్యదర్శిగా నియమితులు కావడానికి సహకరించిన ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్కకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాపై ఉంచిన నమ్మకాన్ని ఏ మాత్రం తప్పకుండా పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని సత్యనారాయణ తెలిపారు.

## రేషన్‌షాపు తనిఖీ



ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్‌లో ప్రజాపంపిణీ దుకాణాన్ని సివిల్‌సప్లై డిఎస్‌వో చందన్‌కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రేషన్ షాపులో మూడు నెలలకు సంబంధించి ప్రజలకు ఇస్తున్న రేషన్ బియ్యం సరఫరా ఏ విధంగా ఉంది అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం రేషన్ షాపుల్లో స్టాకు వివరాలను అడిగి రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా చందన్‌కుమార్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా బియ్యం అమ్మకాలు జరిగిన దళారులకు సరఫరా చేసిన చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సివిల్‌సప్లై ఆర్‌ఐలు వెంకటేశ్వరరావు, కిరణ్, ఇంచార్జ్, రేషన్ డీలర్ వెంకటేశ్వరరావు, కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

# అష్ణగుర్తిలో ఉపాధ్యాయులకే పరిమితమైన పాఠశాల



**గౌండ్లపాలెంలో తెరుచుకున్న పాఠశాల**

ప్రజాపక్షం/వైరా: వైరా మండలం అష్ణగుర్తి గ్రామంలో పాఠశాల ప్రారంభోత్సవం కేవలం ఉపాధ్యాయులకే పరిమితమైంది. ఈ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు. తొలిరోజు కూడా విద్యార్థులు ఎవరు ఇక్కడ కనిపించలేదు. బడిబాట నిర్వహించిన కూడా గ్రామాల్లో స్పందన రాలేదు. ప్రభుత్వ బడిపై నమ్మకం ఆ గ్రామంలో సడలిపోయిందా? ప్రైవేటు పాఠశాల వైపు మోజు పెరిగిందో కాని కేవలం ఉపాధ్యాయులకే తొలిరోజు పాఠశాల పరిమితమైందని చెప్పవచ్చును. అదేవిధంగా సుమారు మూడు సంవత్సరాల తర్వాత గౌండ్లపాలెంలో మరల పాఠశాల తెరుచుకుంది. నలుగురు విద్యార్థులు తొలిరోజు పాఠశాలకు హాజరయ్యారు. బడిబాట కార్యక్రమం తర్వాత గ్రామంలో నలుగురు విద్యార్థులు పాఠశాలలో చేరారు. అయితే ఈ నలుగురు విద్యార్థులు పాఠశాలలో ఉంటారా, ఉండరా అనేది కూడా ఆలోచించాల్సిన పరిస్థితి ఇప్పుడు ఇక్కడ ఏర్పడింది ఏది. తొలిరోజు 48 పాఠశాలలు మండలంలో ఉంటే 47 పాఠశాలలు ప్రారంభమయ్యాయి. అష్ణగుర్తి పాఠశాలలో మాత్రమే విద్యార్థులు లేక ఉపాధ్యాయుల వరకే పరిమితమయ్యారు.

## విమాన దుర్ఘటన విచారకరం : ఎమ్మెల్యే

ప్రజాపక్షం/వైరా: అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన దుర్ఘటన చాలా హృదయ విచారకరమైందని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు. ఈ దుర్ఘటనలో ప్రయాణీకులు, సిబ్బంది ప్రాణాలు కోల్పోవడం తీరని విషాదం. ముఖ్యంగా ఈ విమానం మెడికల్ కాలేజ్, హాస్టల్‌పై కూలిపోవడంతో విద్యార్థుల ప్రాణాలు పోవడం మరింత తీవ్ర విషాదం. ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారందరికి సంతాపం తెలియజేస్తున్నాను. వారి కుటుంబాలకు మనోధైర్యం లభించాలని కోరుకుంటున్నాను. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే సహాయ చర్యలు చేపట్టి మెడికల్ హాస్టల్‌పై ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలి హాస్టల్‌లో ఉన్న మెడికోలు మరణించారు. వెంటనే వారి కుటుంబాలను ఆదుకోవాలని, అదేవిధంగా సిబ్బంది, ప్రయాణీకుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ అన్నారు.

## బాలకార్మిక నిర్మూలన సామాజిక బాధ్యత



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి సామాజిక బాధ్యతని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం రాజేందర్ అన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పెద్దబజార్‌లో జరిగిన హమాలీ కార్మికులతో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదరికం మూలంగా చాలా మంది పిల్లలు బాలకార్మికులుగా మారుతున్నారని అన్నారు. ఇటుకబట్టీల్లో పిల్లలు దినసరి కార్మికులుగా మారుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లలను పనుల్లో పెట్టకుండా బడికి పంపించి కష్టపడి చదివిస్తే వారి జీవితాలు బాగుంటాయని, వృద్ధాప్యంలో అండగా ఉంటారని చెప్పారు. సమావేశం అనంతరం పెద్ద బజార్ కిరాణాషాపులను ఆయన తనిఖీ చేశారు. చిన్నపిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ షర్ఫుద్దీన్, మర్చంట్ కమీషన్ అధ్యక్షులు పల్లపోతు సాయి, హమాలీ కార్మికుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసరెడ్డి, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి పథకం పేదలకు అందాలి :ఎమ్మెల్యే రాగమయి




ప్రజాపక్షం/సత్తుపల్లి: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందాలన్నదే తమ ధ్యేయమని సత్తుపల్లి శాసన సభ్యురాలు డా.మట్టా రాగమయి అన్నారు. గురువారం పట్టణంలోని 18, 19, 23 వ వార్డుల్లో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర పట్టణ అధ్యక్షుడు గాదె చెన్నారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాగమయి ముఖ్య అతిథిగా హాజరై కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ పథకాలు ప్రతి పేదవాడికి అందాలన్నారు. కాంగ్రెస్ జెండా ప్రతి ఇంటి పై ఎగరాలని, అందరు కలిసి కట్టుగా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కృషి చెయ్యాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని, ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అండగా ఉంటామన్నారు. ప్రజలు కష్ట సుఖాల్లో తోడు, నీడగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా నాయకురాలు కుమారి, సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్ బాబు, కమల్ పాషా, పింగుల సామ్యూల్, రామారావు, షరీఫ్, పద్మజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ



ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం : మండల పరిధిలోని కాకరవాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్‌ను పాఠశాల హెచ్‌ఎం నల్లగుంట్ల మధుసూదన్‌రావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న మౌలిక వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఇంగ్లీష్ మీడియం బోధిస్తున్నారని, ఉచిత పాఠ్య పుస్తకాలు, ఉచిత నోట్ పుస్తకాలు, రెండు జతల యూనిఫాం, వారానికి మూడుసార్లు కోడిగుడ్డుతో నాణ్యమైన మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలతో పాటు ఏఐ టెక్నాలజీతో కూడిన కంప్యూటర్ విద్యను కూడా ప్రభుత్వం పేద విద్యార్థులకు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## చిన్నారులను ఆశీర్వదించిన ఎల్‌వి రెడ్డి యువసేన

ప్రజాపక్షం/జూలూరుపాడు: జూలూరుపాడు మండల కేంద్రంలో గల ఏవీఆర్ ఫంక్షన్ హాల్ నందు పాపకొల్లు గ్రామానికి చెందిన కడియాల నరసింహారావు బేబీ దంపతుల కుమారై పావని పుష్పాలంకరణ, కుమారుడు రాకేష్ పంచ కట్టు వేడుకల్లో ఎల్‌వి రెడ్డి యువసేన, కాంగ్రెస్ నాయకులు చిన్నారులను ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో నాయకులు కొదుమూరి కోటేశ్వరరావు, ధర్మరాజు సత్యనారాయణ, భూక్య అమ్మనాయక్, కొండె వీరభద్రం, ధర్మరాజు వెంకట్, నారాయణ, మద్దిచెట్టి వంశీ, కడియాల పుల్లయ్య, ధారావత్ నరసింహారావు, డాక్టర్ డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

**మరొకరికి తీవ్ర గాయాలు..**



ప్రజాపక్షం/సత్తుపల్లి: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడిన సంఘటన సత్తుపల్లి పట్టణ శివారులో గురువారం చోటు చేసుకుంది. బంధువులు, పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. సత్తుపల్లి మండలం, రామగోవిందపురం పంచాయతీ, కొమురం భీం కాలనీకి చెందిన పూకే రాము (45) కాకా ఏసు బాబు, ఇద్దరు సత్తుపల్లి నుంచి గంగారం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, మణుగూరు డిపోకు చెందిన ప్రైవేట్ ఆర్టీసీ బస్సు సత్తుపల్లి నుండి ఏలూరు వైపుకు వెళ్తుంది.ఈ క్రమంలో పట్టణ శివారులోని తమ్మిలేరు వంతెన సమీపంలో ఆర్టీసీ బస్ బైక్ ను ఓవర్టేక్ చేసే క్రమంలో బస్ ముందు భాగం బైక్ కు తగలటం, బైక్ బస్ వెనక టైర్ల కిందకు వెళ్ళటంతో బైక్ పై ఉన్న పూకే రాము (45) బస్సు కింద పడగా, అతనిపైకి బస్సు టైరు ఎక్కటంతో శరీర భాగాలు నుజ్జు నుజ్జు అయి, అక్కడికక్కడే మృతి చెందాడు.మరొక వ్యక్తి కాకా ఏసుబాబుకు తీవ్ర గాయాలు కాగా అతనిని హుటాహుటిన సత్తుపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు. మృతుడు భ్యూకా రాము భార్య నాలుగేళ్ల క్రితం చనిపోగా ఇద్దరు ఆడపిల్లలకు ఇంత కాలం పెద్ద దిక్కుగా నిలిచిన తండ్రి రాము రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఇద్దరు ఆడపిల్లలు అనాధలుగా మిగిలారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటనపై స్థానిక సత్తుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## 14న జాతీయ లోక్ అదాలత్

**-న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ రాజగోపాల్**

ప్రజాపక్షం/ఖమ్మం లీగల్ : ఈనెల 14న జిల్లా కోర్టులోని న్యాయసేవాసదన్‌లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ రాజగోపాల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీ మార్గమే రాజమార్గమని, రాజీపడదగ్గ కేసుల్లో రాజీపడి సత్వర న్యాయం పొందాలని తెలిపారు. లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకుని త్వరితగతిన కేసులను పరిష్కరించుకోవాలని న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ తెలిపారు.

# పేదలకు కేటాయించిన ఇండ్ల స్థలాలు వారికే ఇవ్వాలి

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మండల కేంద్రమైన రఘునాథపాలెం సర్వే నెం. 218 నందు ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇండ్ల స్థలాలను బై బ్యాక్ తీసుకోవాలన్న నిర్ణయాన్ని విరమించుకుని వారికే ఇండ్ల స్థలాలు కేటాయించాలని అఖిలపక్ష నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇండ్ల స్థలాలను బై బ్యాక్ తీసుకోవాలన్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బాధితుల తరుపున అఖిల పక్షం నాయకులు గురువారం రౌండ్ టేండ్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రఘునాథపాలెం సర్వే నెం. 218 నందు 2009లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇండ్ల పట్టాలు ఇచ్చారని తర్వాత 2018లో తెలంగాణ ప్రభుత్వం అప్పుడు ప్రభుత్వం ఇచ్చిన ఆంధ్రప్రదేశ్ పట్టాలను మార్చి తెలంగాణ ప్రభుత్వం పేరుతో 725 మందికి ఒక్కొక్కరికి 75 గజాల చొప్పున ఇండ్ల స్థలాలను కేటాయించి పట్టాలు ఇచ్చిందన్నారు. ఎటువంటి సౌకర్యాలు లేకపోయినా పట్టాలు ఇచ్చిన వెంటనే పలువురు బేస్‌మెంట్లు నిర్మించుకున్నారని నాయకులు తెలిపారు. ఇటీవల నాగపూర్ అమరావతి నేషనల్ హైవే ఈ ప్లాట్ల మధ్య నుంచి వెళ్తుందని అధికారులు సర్వే చేశారు. సుమారు 261 ప్లాట్ల మీదుగా జాతీయ రహదారి పోతుందని సర్వే నిర్వహించారు. ప్లాట్లు పోతున్న బాధితులు మంత్రులు, అధికారులను కలిసి తమ సమస్యను వివరించారు. ఆ సమయంలో అధికారులు తగిన న్యాయం చేస్తామని ప్లాట్లు కోల్పోతున్న వారికి వేరే ప్రాంతంలో స్థలం లేదా పరిహారం అందిస్తామని తెలిపారు. ఓ వైపు జాతీయ రహదారితో పలువురు ప్లాట్లు




కోల్పోతుంటే ఇప్పుడు మరల యంగ్ ఇండియా స్కూల్ పేరుతో 30 ఎకరాల స్థలం అవసరం కాగా సర్వే నెం. 218లోనే మిగిలిన ప్లాట్‌లోని స్థలాలను కేటాయించడం శోచనీయమన్నారు. అక్కడ ఎవరికి ప్లాట్లు లేవంటూ ప్రభుత్వమే ఇచ్చిన పట్టాలను బై బ్యాక్ తీసుకుందని అధికారులు అంటున్నారని తెలిపారు. గతంలో పట్టాలు ఇచ్చిన వారందరికీ న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఇచ్చిన ప్రాంతంలోనే స్థలాలు చూపించాలని లేదా ప్రత్యామ్నాయ స్థలాలు చూపించాలని లేని పక్షంలో అఖిల పక్షం ఆధ్వర్యంలో బాధితుల పక్షాన ఎటువంటి పోరాటానికైనా సిద్ధమేనని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు నున్నా నాగేశ్వరరావు, మేకల శ్రీనివాసరావు, పగడాల నాగరాజు, ఉపేందర్, సాహు, వై. విక్రం, ఆవుల మంగతాయి, రాంబాబు, నవీన్‌రెడ్డి, విజయ్, ఉపేందర్, మనోహర్, శ్రీధర్, శ్రీను, ప్రసాద్, గోపాలరావు, ప్రవీణ్, షకీనా తదితరులు పాల్గొన్నారు.

# మోగిన బడి గంట

**-పాఠశాలలు పున : ప్రారంభం**
**-ప్రభుత్వ పాఠశాలల్లో 48 శాతం హాజరు నమోదు**

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** వేసవి సెలవుల అనంతరం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బడి గంట మోగింది. ఈ ఏడాది ఏప్రిల్ 23తో విద్యా సంవత్సరం ముగియడంతో వేసవి సెలవులు ప్రకటించారు. సుమారు 50 రోజుల తర్వాత మరల గురువారం నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ రఘునాథపాలెం మండలం, పువ్వాడ నగర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో తొలి రోజే విద్యార్థులకు పాఠ్య, నోటుపుస్తకాలు, ఒక జత ఏకరూప దుస్తువులను అందజేశారు.బడిబాట కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పెంచేందుకు ఉపాధ్యాయులు విస్తృత ప్రచారం నిర్వహించడంతో పలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగినట్లు సమాచారం. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి పదవ తరగతి వరకు 54,225 మంది విద్యార్థులకు గాను తొలి రోజు 26,033 మంది విద్యార్థులు హాజరయ్యారు. తొలి రోజు 48 శాతం హాజరు నమోదైంది. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా మొత్తం ఉపాధ్యాయులు 5,020 మంది ఉండగా 49 మంది సెలవులు తీసుకోగా మరో ముగ్గురు ఎటువంటి అనుమతి లేకుండా విధులకు గైర్హాజరయ్యారు. మిగిలిన వారు విధుల్లో పాల్గొన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం ఒక్క రోజే ఒకటవ తరగతిలో 366 మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు పొందగా,



రెండవ తరగతి నుంచి పదవ తరగతి వరకు జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో 249 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందినట్లు జిల్లా విద్యాశాఖాధికారి సామినేని సత్యనారాయణ తెలిపారు. పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, సంచులు, షూ, యూనిఫాం సమకూర్చే పనిలో తల్లిదండ్రులు నిమగ్నమయ్యారు. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభం కావడంతో రోడ్లపై స్కూల్ బస్సులు దర్శన మిచ్చాయి. విద్యార్థుల రాకతో పాఠశాలల్లో సందడి నెలకొంది. పలు ప్రభుత్వ పాఠశాలలను మామిడి తోరణాలు, పూలు, రంగులు వేసి అందంగా ముస్తాబు చేసి విద్యార్థులకు స్వాగతం పలికారు.

# పత్తి రైతులు తొందరపడి విత్తనాలు విత్తవద్దు



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జిల్లాలోని రైతాంగంకు సరిపడ ఎరువులు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా వ్యవసాయాధికారి డి.పుల్లయ్య పేర్కొన్నారు. మండలం లోని రామచంద్రాపురం, పైనంపల్లి, నాచేపల్లి, అప్పలనరసింహాపురంలో సొసైటీలను, మంగాపురంతండాలో ఎరువుల దుకాణం ను గురువారం తనిఖీ చేశారు. స్టాక్ ను పరిశీలించారు. విక్రయాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్ల తో మాట్లాడారు. జిల్లాలోని రైతులకు జూన్ మాస కు సంబంధించిన ఎరువులు 25 వేల మెట్రిక్ టన్నులు సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. జిల్లాలో ఖరీఫ్ సీజన్ లో 6.10 లక్షల ఎకరాలు సాగు లక్ష్యం ఖరారు అయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మండల వ్యవసాయాధికారి యం.రాధ, ఫర్టిలైజర్స్ డీలర్ ధీరావత్ రాధాకృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# మీ పిల్లలు ఉంటే ఇలానే ఉంచుతారా..?

**-కంపు కొడుతున్న పాఠశాల.... ఉపాధ్యాయులను నిలదీసిన పేరెంట్స్**





**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఒక పక్క విద్యార్థులు ప్రవేట్ పాఠశాల బాట పడుతుంటే, ఎలాగైన ప్రభుత్వ బడులను బ్రతికించుకోవాలని, వివిధ పధకాలతో ప్రచారం చేస్తున్న పాఠశాలల ఉపాధ్యాయులు, కానీ ఇక్కడి ఉపాధ్యాయుల తీరు తో వచ్చిన విద్యార్థులను వెంట తీసుకుని వెళ్తున్నారు. కనీసం తొలి రోజు పాఠశాల ను బాగు చేసుకోవటం రాకపోవటంతో తల్లిదండ్రులు నిలదీశారు. జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని రాయగూడెం జిల్లా పరిషత్ పాఠశాల గురువారం ప్రారంభం సందర్భంగా ఉపాధ్యాయుల తీరు పై తల్లిదండ్రులు మండిపడ్డారు. పాఠశాల పరిశుభ్రత పూర్తిగామాయమైంది. మరుగుదొడ్లు, టాయిలెట్స్ కంపు కొడుతున్నాయి. ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉంది. విద్యార్థులకు ఇవ్వాల్సిన ప్లేట్స్ మరుగుదొడ్డి వద్ద పడేశారు. గ్రామానికి చెందిన నేలకొండపల్లి సొసైటీ డైరెక్టర్ తీగ రమణయ్య తో పాటు మరి కొంత మంది వారి పిల్లలను బడిలో చేర్పించేందుకు వెళ్లారు. కానీ అక్కడ పారిశుద్ధం ను చూసి ఖంగుతిన్నారు. మీ పిల్లలు పాఠశాలలో ఉంటే ఇలానే ఉంచుతారా అని నిలదీశారు. టాయిలెట్స్ వైపు చూడకుండానే దుర్గంధం వెదజల్లుతుంది. ముక్కు మూసుకోక తప్పని పరిస్థితి నెలకొంది. ఉపాధ్యాయుల తీరు పైజిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయనున్నట్లు పేరెంట్స్ తీగ రమణయ్య తెలిపారు. ఈ విషయం పై స్థానిక ప్రధానోపాధ్యాయుడు ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని ఆయూష్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ కె. పద్మావతి తెలిపారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం పెవిలియన్ మైదానంలో ఆయూష్ ఆధ్వర్యంలో యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయూష్ సీనియర్ మెడికల్ ఆఫీసర్ కె. పద్మావతి, యోగా నిపుణురాలు సంధ్యారాణి తో పెవిలియన్ మైదానంలో నడక సాధకులకు యోగాపై అవగాహన కల్పించారు. అనేక జబ్బులకు పరిష్కార మార్గానికి సంబంధించి ఆసనాలతో సంపూర్ణ ఆరోగ్యాన్ని ఎలా పెంపొందించుకోవచ్చో వివరించారు. నేటి సమాజంలో స్త్రీ, పురుషులు అనే బేధం లేకుండా మత్తు పదార్థాలకు అలవాటు పడి ఆరోగ్యాలు పాడు చేసుకుంటున్నారని అటువంటి చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటే యోగా అక్కడే సరైన మార్గమని ప్రతి ఒక్కరూ యోగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యులు, నడక సాధకులు రామనాథం, రాకం శ్యాంబాబు, విజయ్‌కుమార్, మందా వెంకటేశ్వర్లు, మందా సుశీల, చంద్రశేఖర్, వెంకట్, భాస్కర్, రమాశేఖర్, పద్మ, సబిత తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రభుత్వ పాఠశాలలను సద్వినియోగం చేసుకోవాలని ఖమ్మం ఇంటర్ జిల్లా విద్యాశాఖాధికారి కె.రవిబాబు సూచించారు. మండలం లోని సింగారెడ్డిపాలెం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం కార్పోరేట్ స్థాయిలో విద్య ను అందిస్తుందని అన్నారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. విద్య కు ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అన్నారు. బడులను బలోపేతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు, మండల విద్యాశాఖాధికారి బాలిన చలపతిరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక వాడలో ఘోర రోడ్డు ప్రమాదం

**-స్కూటీనీ ఢీకొన్న లారీ... వృద్ధుడు దుర్మరణం**



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని పారిశ్రామిక వాడ సారపాకలో గురువారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకోగా ఓ వృద్ధుడు(ఐటిసి విశ్రాంత ఉద్యోగి) దుర్మరణం పాలైన సంఘటన చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం సారపాక మసీద్ రోడ్డులో నివాసముంటున్న గంగుల రాజేశ్వరరావు(65) ఐటిసి పిఎస్‌పిడి కర్మాగారంలో రా మెటీరియల్ విభాగంలో గతంలో మేనేజన్‌గా పని చేసి పదవీ విరమణ చేశారు. సారపాక మసీద్ రోడ్‌లో ఇల్లు కొనుక్కొని 20 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో సాయంత్రం స్కూటీపై సారపాక సెంటర్ నుండి ఇంటికి వెళుతున్న క్రమంలో భద్రాచలం వైపు నుండి వస్తున్న లారీ ఆర్చ్ వద్ద ఢీ కొట్టి 20 మీటర్ల మేర వేగంతో ఈడ్చుకెళ్లింది. ఈ సంఘటనలో రాజేశ్వరరావు శరీర భాగాలు చిద్రమై చెల్లా చెదురుగా పడటంతో పాటు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఆయన స్కూటీ సైతం నుజ్జుయింది. దీంతో లారీ డ్రైవర్ ఇరువైపులా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదం సమాచారం అందుకున్న ఎస్ఐ ఈ రాజేష్ హుటాహుటిన అక్కడకు చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఆసుపత్రికి తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారుల లిస్టును బహిర్గతం చేయాలి



**ప్రజాపక్షం/ బోనకల్ :** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన ఇందిరమ్మ ఇళ్ళ పథకంలో భాగంగా ఎంపికైన లబ్ధిదారుల లిస్టులను గ్రామపంచాయతీల్లో అంటించాలని సిపిఐ బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు అధికారులను కోరారు. గురువారం మండల కేంద్రంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఎంపికను రహస్యంగా చేయాల్సిన అవసరం ఏముందని, ఎవరైతే నిజమైన అర్హత కలిగి ఉన్నారో వారిని అధికారులు లబ్ధిదారులుగా ఎంపిక చేసినట్లయితే వారి జాబితాను గ్రామపంచాయతీ కార్యాలయాల్లో అంటించాల్సిన అవసరం ఉందన్నారు. అలా అంటించడం వలన మొదటి లిస్టులో ఎవరికి ఇళ్లు వస్తుందో, రెండవ లిస్టులో ఎవరకి వస్తుందో, అసలు వస్తుందో రాదో అనే విషయాలు తేటతెల్లమవుతాయన్నారు. ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క ప్రాతినిధ్యం వహించే ఈ నియోజకవర్గంలో అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు దక్కాల్సిందేనన్నారు. మండలంలోని ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై రాబోయే రోజుల్లో సిపిఐ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. బుధవారం జరిగిన 17వ మండల మహాసభలో తిరిగి మూడోసారి మండల కార్యదర్శిగా ఎన్నిక కావటానికి సహకరించిన సిపిఐ సభ్యులకు, జిల్లా, రాష్ట్ర నాయకత్వానికి ఆనందరావు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి జక్కుల రామారావు, కౌన్సిల్ సభ్యులు కొంగర భాస్కర్‌రావు, గుంపులు జయరాజు తదితరులు పాల్గొన్నారు.